

- ఎన్నికల సీజన్ కోసం నాయకుల పాకులాట
- ధరల పెరుగుదలతో బయటి మద్యంవైపే మొగ్గు
- ఇప్పటికీ జిల్లావాసులను భయపెడుతున్న గోవా మందు
- నాటి ఘటనలతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నం
- ఇప్పుడూ అదే పరిస్థితి వస్తుందేమోనని దిగులు



పొరుగు మద్యం పెరుగుతోంది!

నెల్లూరు (క్రైం), జనవరి 30 : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, ప్రజలను ఆకర్షించేం దుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా ప్రధానంగా కొంతమంది నాయకులు మద్యంపైనే దృష్టి సారించారని తెలుస్తోంది. కోడ్ రాకముందే పొరుగు మద్యంను జిల్లా కు దిగుమతి చేసుకుని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే 2014 నాటి ఘటనలే పునరావృతం అవుతాయనే భయం జిల్లావాసుల్లో నెలకొంది.

● అప్పుడేం జరిగిందంటే..

2014, ఎన్నికల సమయంలో జిల్లాలో ఎక్స్‌కవేటర్లతో భూమిలో తవ్వేకొద్దీ ఇతర రాష్ట్రాల మద్యం సీసాలు బయట పడ్డాయి. ఆ మద్యం సేవించి ప్రాణాలు కోల్పోయిన వారు, అప్పటి నాయకులపై కేసుల నమోదు, విచారణ బాధ్యతను సీఐడీకి అప్పగించడం వంటి సంఘటనలు జరిగాయి.

● రెండేళ్ల కిందట గోవా మద్యం నిల్వలు

2022, మార్చి నెలలో గోవాకు చెందిన వేల క్వార్టర్ మద్యం సీసాలను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. గోవాకు చెందిన చీప్ మద్యంను జిల్లాకు దిగుమతి చేసుకొని ఆ సీసాలపై ప్రభుత్వ మద్యం సీసాల లేబుళ్లను అతికించి ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే విక్రయించారు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గోవా మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకొని పలువురిని అరెస్ట్ చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇదంతా చేశారన్న ప్రచారం అప్పట్లో గుప్పుమంది. రెండేళ్ల కిందటే వేల మద్యం సీసాలను గోవా నుంచి జిల్లాకు దిగుమతి చేసిన ఘనులు ప్రస్తుత ఎన్నికల సీజనులో చీప్ మద్యాన్ని జిల్లాకు తీసుకురావడం పెద్ద పనేమీ కాదని అందరూ చర్చించుకుంటున్నారు.

● కోడ్ అమల్లోకి వస్తే..

సహజంగా ఎన్నికల కోడ్ వస్తే ఎక్సైజ్ అధికారులు దుకాణాలు, బార్లలో మద్యం విక్రయాలపై నిబంధనలు అమల్లోకి తెస్తా రు. గతేడాది ఇదే సీజనులో ఆయా దుకా ణాలు, బార్లలో ఎంతమద్యం కొనుగోలు చేశారో లెక్కలు చూసుకొని ఆ ప్రకారమే డిపో నుంచి మద్యం అందిస్తారు. దీంతో పలువురు నాయకులు ఇప్పటి నుంచే మద్యం కొనుగోలు చేసి నిల్వలు చేస్తున్నారని తెలుస్తోంది.

● కమీషన్ లేక, ధరలు పెరగడం

గతంలో ప్రైవేటు వైన్స్, బార్లు ఉన్న సమయంలో మద్యం అమ్మకాలపై యజమానులకు 11 శాతం వరకు కమీషన్ ఉండేది. అంటే డిపో నుంచి ఇక లక్ష రూపాయలకు మద్యం కొనుగోలు చేస్తే రూ.11 వేలు కమీషన్ ఉండేది. ఎన్నికల సీజనులో పలు పార్టీలకు చెందిన నాయ కులు ప్రైవేటు వైన్ షాపులు, బార్ల యాజ మాన్యంతో ఉన్న పరిచయాలతో డిపో నుంచి మద్యంను కొనుగోలు చేయించి ఎన్నికల కోసం వినియోగించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాలు ఏర్పడటం, బార్ల యజమానులకు కమీషన్ పూర్తిగా ఎత్తేయ డంతో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసే అవకాశం నాయకులకు లేకుండా పోయింది. మరోవైపు గత ఎన్నికల సమయంలో క్వార్టర్ బాటిల్ రూ.80 ఉంటే ప్రస్తుతం రూ.200లకు పైగా ఉంది. ఇతర రాష్ట్రాల్లో మద్యం ధరలు తక్కు వగా ఉండటంతో అక్కడి నుం చే వివిధ మార్గాల ద్వారా మద్యం తెచ్చుకునేందుకు విఫలయత్నం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వ మద్య దుకాణల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ప్రతి దుకాణంపై ప్రత్యేక నిఘా ఉంచాము. ఎవరు తప్పు చేసినా శిక్ష తప్పదు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత గతేడాది ఆ నెలలో జరిగిన సేల్స్ ఆధారంగా దుకాణాలకు, బార్లకు స్టాక్ ఇవ్వడం జరుగుతుంది.

- కె నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ ఈఎస్



మహాత్ముడికి ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీకి కలెక్టర్ హరినారాయణన్ ఘన నివాళి అర్పించారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని కలెక్టరేట్‌లో ఆయన ఫొటోకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం)

నేటి నుంచి నారా భువనేశ్వరి పర్యటన

- 'నిజం గెలవాలి' నినాదంతో ప్రజల ముందుకు..
- చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబాలకు ఓదార్పు

నెల్లూరు, జనవరి 30 (ఆంధ్రప్రదేశ్) : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును సహించలేక మనోవేదనతో తనువు చాలించిన అభిమానుల కుటుంబాలను ఓదార్చేందుకు నందమూరి తారక రామారావు కుమార్తె, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం సాయంత్రం జిల్లాకు రానున్నారు. మూడు రోజులపాటు జిల్లాలోనే ఆమె పర్యటిస్తూ బాధితుల కుటుంబాలకు తామున్నామంటూ భరోసా ఇవ్వనున్నారు. ఓ వైపు బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు రాష్ట్ర రాజకీయాలు, పరిపాలనలో జరుగుతున్న అక్రమాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో వారిని సత్యం వైపు నిలిచేలా, నిజమైన ప్రజా సేవకులు గెలిచేలా 'నిజం గెలవాలి' పేరిట చైతన్య పరచనున్నారు.



● బుధవారం సాయంత్రం 5.35 గంటలకు ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం గ్రామంలో వయ్యాల సుధాకర్ రావు కుటుంబాన్ని, 6.30 గంటలకు ఉలవపాడు మండలం ఆత్మకూరులో యండ్లూరి చిన్నకోటయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శిస్తారు. ఆ రాత్రి ఆళ్వారి కల్యాణ మండంలో రాత్రి బస చేస్తారు.

● 1వ తేది ఉదయం 9.40 గంటలకు గుడ్లూరులో కర్పూరపు సుబ్రహ్మణ్యం, 10.45 గంటలకు దార్కనిపాడు గ్రామంలో దగ్గుమాటి వెంకటేశ్వర్లు కుటుంబాలను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో తాటిపర్తి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి నెల్లూరుకు చేరుకుంటారు. సాయంత్రం 3.35 గంటలకు 29వ డివిజన్‌కు చెందిన రేగల వెంకయ్య, 41వ డివిజన్ మూలాపేట పోల సుబ్బారావు కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం 4.50 గంటలకు జొన్నవాడ కామాక్షితాయి ఆలయాన్ని సందర్శిస్తారు. 2వ తేది ఉదయం 10.20 గంటలకు ఆత్మకూరు మండలం అల్లీపురంలో కముజుల అంజనేయరెడ్డి, 11.55 గంటలకు కలువాయిలో బొల్లిగార్ల చిన్నయ్య, మధ్యాహ్నం 2 గంటలకు రాపూరు మండలం నసయపాలెంలో సన్నిబోయిన కృష్ణయ్య కుటుంబాలను భువనేశ్వరి పరామర్శిస్తారు. ఆ తర్వాత 3.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.



ఆందోళన చేస్తున్న బీటీఏ నేతలు

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట బీటీఏ ఆందోళన

నెల్లూరు (విద్య), జనవరి 30 : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీటీఏ నేతలు డిమాండ్ చేశారు. మంగళ వారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షుడు పల్లం వేణు గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తూ ఉపాధ్యాయుల ప్రయోజనాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం బీటీఏ చేపట్టిన మూడుదశల పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 5న విజయవాడలో జరిగే మహాధర్నాకు తరలిరావా లని కోరారు. కార్యక్రమంలో బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమ ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ లక్ష్మయ్య, కార్యదర్శులు బ్రహ్మయ్య, రఘు, తిరుపతయ్య, జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, కార్యదర్శి మాసా ప్రసాద్ పాల్గొన్నారు.


నేటి నుంచి యూటీఎఫ్ రిలే నిరాహార దీక్షలు

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి ఫిబ్రవరి 3వతేదీ వరకు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతి శర్మ ఓ ప్రకట నలో పేర్కొన్నారు. యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై అధిష్ఠానం మల్లగుల్లాలు

- బీసీ అభ్యర్థివైపే మొగ్గు?
- కందుకూరుపై మనసు మార్చుకున్న బుర్రా?
- టికెట్‌పై ధీమాగా ఎమ్మెల్యే మహీధరరెడ్డి
- కావలి, కందుకూరు పార్టీ బాధ్యతలు 'చెవిరెడ్డి'కి

కందుకూరు, జనవరి 30: కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్థానంలో బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలన్న ఆలోచనతో పలువురు అభ్యర్థుల పేర్లను అధిష్ఠానం పరిశీలించిన విషయం తెలిసిందే. అయితే, వారెవరూ ఆర్థిక, అంగబలం కలవారు కాదన్న నిర్ధారణకు వచ్చిన అధిష్ఠానం కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరులో పోటీకి సిద్ధపడాలని సూచించిన విషయం తెలిసిందే. అయితే మొదట్లో కనిగిరి ఇస్తే పోటీ చేస్తా లేకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టంగా చెప్పిన బుర్రా ఆ తర్వాత మనసు మార్చుకున్నట్లు తెలిసింది. 4, 5 రోజులుగా విజయవాడలో మకాం వేసి కనిగిరి అభ్యర్థిత్వం కోసం తుదిప్రయత్నాలు చేసుకుంటూ కందుకూరు ఆప్షన్‌ను కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది. అంతేగాక 2, 3 రోజులుగా కందుకూరు నియోజకవర్గంలో తన బంధువులు, సన్నిహితులతో కందుకూరు నుంచి పోటీ చేస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన కీలక పరిణామాలు కందుకూరులో అభ్యర్థిని మార్చాలన్న అధిష్ఠానం ఆలోచనలో ఎలాంటి మార్పురాలేదన్న సంకేతాలు వెలువడ్డాయి. నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను చూస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని తప్పించి ఆ బాధ్యతలను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి జగన్ అప్పగించినట్లు తెలిసింది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డిని ఖరారు చేసిన జగన్ ఆ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కందుకూరు, కావలి నియోజకవర్గాల పార్టీ బాధ్యతలను కూడా చెవిరెడ్డికి అప్పగించినట్లు తెలిసింది. కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి విషయంలో జగన్ ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించకుండా విజయసాయి పని చేస్తుండటమే ఈ మార్పునకు కారణంగా భావిస్తున్నారు. పార్టీ పరిశీలకునే మార్చటానికి జగన్ సిద్ధపడినందున ఆయన బీసీ అభ్యర్థిత్వం విషయంలో ధృడమైన నిర్ణయంతో ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే మహీధరరెడ్డి మాత్రం కందుకూరు టికెట్ విషయంలో ధీమాగా ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అయితే వైసీపీ అధిష్ఠానం వేగంగా పావులు కదుపుతున్న నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.





వీఆర్వో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డితో పదోన్నతి పొందిన వీఆర్వోలు

గ్రేడ్-1 వీఆర్వోలకు ఉద్యోగోన్నతి

- తాత్కాలిక ఎస్ఏలుగా నియామకం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 30 : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 13 మంది గ్రేడ్-1 వీఆర్వోలకు తాత్కాలిక సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ హరినారాయణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేవూరు అమరావతి, ఆత్మకూరు ప్రసాద్, నిజమాల తిరుపతయ్య, కుల్లూరు జనార్దన్‌రావు, దాసరి హనుమంతయ్య, కర్రా రామయ్య, సీహెచ్ వెంకటేశ్వర శర్మ, కే పుల్లయ్య, పీ రవిబాబు, షేక్ రహంతుల్లా, గునుపాటి మురళీకృష్ణ, మడపర్తి శ్రీనివాసులు, ఏవీవీ ప్రసాదరావు తదితరులు ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు. వీరు వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

- డిమాండ్ల సాధన కోసం ఉద్యమం
- వచ్చే నెల 5న విజయవాడలో ఆమరణ దీక్ష

సర్పంచుల సమర శంఖం

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 : తమ డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో ఆమరణ దీక్షకు సర్పంచులు సిద్ధమవుతున్నారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించినా, సర్పంచులకు ప్రజాప్రతినిధులన్న కనీస గౌరవం ఈ ప్రభుత్వంలో లేకుండా పోయింది. జగన్ ప్రభుత్వం ఎన్నో విధాలుగా సర్పంచులను ఇబ్బందులకు గురిచేసినా, ఉత్సవ విగ్రహాలుగా మార్చేసినా భరిస్తూ వచ్చారు. ఇదిచాలదన్నట్టు పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి నిధులు ఇవ్వకపోగా 14, 15 ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నగదునూ జగన్ ప్రభుత్వం లాగేసుకుంది. ఇప్పటివరకు రూ.3వేలకోట్లకు పైబడి దారి మళ్లిందని సర్పంచులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు లేక ప్రజల ముందు తలెత్తుకోలేక తీవ్ర అవమాన భారాన్ని మోశారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు తరువాత వారికి కనీస విలువ లేకుండా పోయింది. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పెత్తనం కూడా వీరిపై ఎక్కువయ్యింది. ఇలా అనేక అవమాన భారంతో రగిలిపోతున్న సర్పంచులు ప్రభుత్వంపై సమరశంఖం పూరించారు.

డిమాండ్లు ఇవే :



● 2018 నుంచి 2020-22 వరకు కేంద్ర ప్రభుత్వం పంపిన రూ.8,629 కోట్ల 14, 15 ఆర్థిక సంఘం నిధులను తక్షణమే పంచాయతీల ఖాతాలకు జమచేయలి. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరానికి 2024 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రావాల్సిన రూ.2031 కోట్ల కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయాలి.

● గ్రామ సచివాలయాలను, వలంటీర్లను గ్రామ పంచాయతీలలో విలీనం చేసి సర్పంచుల ఆధ్వర్యంలోనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరపాలి.

● సర్పంచులు, ఎమ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.15వేలకు పెంచాలి.

● జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను పంచాయతీలకు ఇచ్చి గ్రామసభల తీర్మానం ద్వారా సర్పంచుల ఆధ్వర్యంలో పనులు చేయించాలి.

● కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించి వెంటనే ఆ పథకం పనులను గ్రామాల్లో ప్రారంభించాలి.

● మైనర్ పంచాయతీలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలి.

● 2019 నుంచి 2023 వరకు మైనింగ్ సెస్, ఇసుకలో వాటా నిధులు, రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రొఫెషనల్ టాక్సు, ఎంటర్‌టైన్‌మెంటు టాక్సు, నీటి తీరువా తదితరాల నిధులను పంచాయతీలకు విడుదల చేయాలి.

● పంచాయతీల సొంత నిధులు, ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోను రద్దు చేయాలి.

● పంచాయతీల సొంత నిధులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్ ఆంక్షలు ఎత్తివేయాలి.

● 5వ ఆర్థిక సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి దాని సిఫార్సుల మేరకు గ్రామ పంచాయతీలకు తక్షణమే నిధులు విడుదల చేయాలి.

● ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధి కోసం ఎమ్మెల్యేలకు కేటాయిస్తున్న రూ.20 లక్షలను పంచాయతీలకు ఇచ్చి, పంచాయతీల తీర్మా నం ప్రకారం పనులు చేయించాలి.

● కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన అన్ని రకాల నిధులను బకాయిలతో సహా సర్పంచుల పీఎఫ్ఎంఎఫ్ ఖాతాల్లో జమచేయాలి. తదితర డిమాండ్ల సాధన కోసం సర్పంచులు ఉద్యమం చేపడుతున్నారు.

మా డిమాండ్లు నెరవేర్చాలి



ఇప్పటికే పలు రకాలు గా నిరసన కార్యక్రమాలు చేపట్టాం. మంగళ వారం నెల్లూరులోని గాంధీ బొమ్మ వద్ద నిరసన దీక్ష చేపట్టాం. ప్రభుత్వం మా డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి. లేకుంటే 5వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఆమరణ దీక్షకు పూనుకుంటాం.

- కందమూడి శివకుమార్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం

మా నిధులు మాకివ్వండి!

- గాంధీబొమ్మ వద్ద సర్పంచుల నిరసన దీక్ష



సర్పంచుల దీక్షకు మద్దతు తెలిపిన టీడీపీ నేతలు అజీజ్, చేజర్ల తదితరులు

నెల్లూరు (జడ్పీ), జనవరి 30: పంచాయతీలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర సర్పంచుల సంఘం, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద సర్పంచులు నిరసనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవిరెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని మండిపడ్డారు. గ్రామ స్వరాజ్యంపై గాంధీజీ కన్నకలలు నిజం చేయడం కోసం నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీలకు ప్రత్యేకాధికారాలు కల్పించారన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 14-15 ఆర్థిక సంఘాల ద్వారా విడుదలైన రూ.8,600 కోట్లను దారి మళ్లించి, తమ అవసరాలకు వాడుకున్నదని మండిపడ్డారు. ప్రజల నుంచి ఎన్నుకున్న సర్పంచులు నిధుల కొరతతో చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిన పంచాయతీ సొమ్మును తిరిగి ఇప్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నేరుగా పంచాయతల ఖాతాలకే నిధులు జమచేస్తామని కేంద్రం చెప్పిందని, అయితే ఈ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు ఆదేశాలు జారీ చేయడం మంచిదికాదన్నారు.

● టీడీపీ, జనసేనల మద్దతు

సర్పంచుల ఆందోళనకు టీడీపీ, జనసేన నాయకులు మద్దతు తెలిపి, దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నామమాత్రంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిన సీఎం జగన్ సర్పంచ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని అపహాస్యం చేస్తూ సర్పంచుల అధికారాలను, విధులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దీక్షలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, సర్పంచులు కవిత, పద్మయ్య, మురళీ కృష్ణారెడ్డి, పావని, టీకే శ్రీనివాస్, వెంకట్వేర్లు నాయుడు, వెంకటేశ్వ ర్లురాజు, గోపిరెడ్డివెంకట్, కలవకోలు మునేష్ తదితరులు పాల్గొన్నారు.

తలుపూరుపాడులో దారుణం

- భర్తకు మద్యం తాపించి వృద్ధురాలి హత్య
- ఆపై నగల అపహరణ
- అంత్యక్రియల తరువాత అనుమానం
- పరారీలో నిందితుడు



గ్రామంలో స్థానికులను విచారిస్తున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి



మృతురాలు మస్తాన్‌బీ (ఫైల్)

సంగం, జనవరి 30: మండలంలోని తలుపూరుపాడులో వృద్ధురాలి ఒంటిపై ఉన్న నగలపై కన్నేసిన యువకుడు కసాయిగా మారాడు. ఆ వృద్ధురాలి భర్తకు మద్యం తాపించి కోమాలోకి వెళ్లిన తరువాత అర్ధరాత్రి వృద్ధురాలిని గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఆ వృద్ధురాలి ఒంటిపై ఉన్న నగలు అపహరించి, గుట్టు చప్పుడు కాకుండా జారుకున్నాడు. మరుసటి రోజు మధ్యాహ్నం కోమాలో నుంచి బయటకు వచ్చిన వృద్ధుడు భార్య అపస్మారక స్థితిలో పడి మృతి చెంది ఉండడంతో గమనించి స్థానికులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆ యువకుడిపై అనుమానంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కథనం వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ సాహెబ్, మస్తాన్‌బీ వృద్ధ దంపతులు. వీరు స్వంత ఇంట్లో నివశిస్తున్నారు. వీరికి నలుగురు కుమారులు, అందరికి వివాహాలయ్యాయి. వీరిలో ఇద్దరు దామరమడుగులో, ఒకరు బెంగళూరు, మరొకరు మర్రిపాడులో ఉన్నారు. వృద్ధురాలి వద్ద 8 సవర్ల బంగారు నగలు ఉన్నాయి. ఇంట్లో భద్రపరిచే అవకాశం లేదని ఆమె ఒంటి మీద ధరించింది. గ్రామంలో ఉన్న ఓ మనవరాలు వీరికి ఏదైనా అవసరమైతే చూస్తుంటుంది. ఈ క్రమంలో దంపతులిద్దరు శనివారం దామరుడుగులోని కుమారుల వద్దకు వెళతామని మనవరాలికి చెప్పారు. ఊరికి వెళ్లి ఉంటారని ఆమె భావించి వృద్ధులున్న ఇంటి వైపు వెళ్లలేదు. అయితే శనివారం సాయంత్రం స్థానిక యువకుడు వృద్ధుడికి మద్యం సీసా తెచ్చిచ్చాడు. మద్యం తాగిన వృద్ధుడు కోమాలోకి వెళ్లాడు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఆదివారం మధ్యాహ్నానికి కోమాలో నుంచి బయటకు వచ్చాడు. ఇంటోకి వెళ్లి చూడగా భార్య మస్తాన్‌బీ (77) అపస్మారక స్థితిలో కింద పడి మృతి చెంది ఉంది. దీంతో కాలనీలో ఉన్న మనవరాలికి సమాచారం అందించాడు. ఆమె స్థానికులతో కలిసి వచ్చి చూడగా వాంతులు చేసుకుని, బట్టలో మలవిసర్జన చేసుకుని విగతజీవిగా పడి ఉంది. దీంతో గుండెపోటుతో మృతి చెంది ఉంటుందని అందరూ భావించారు. కుటుంబ సభ్యులందరూ వచ్చిన తరువాత సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే వృద్ధురాలి ఒంటి మీద ఉన్న బంగారు నగలు మొదట వచ్చిన కుటుంబ సభ్యులే తీసి ఉంటారని మిగతా కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు భావించారు. అంత్యక్రియల తరువాత నగలపై ఆరా తీయగా కుటుంబ సభ్యులెవరూ తీయలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో మద్యం సీసా తెచ్చిచ్చిన యువకుడు విషయం వెలుగు చూసింది. దీనికి తోడు మృతదేహానికి స్నానం చేయించేటప్పుడు మెడ మీద గాయాలు, వాసి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. ఈ క్రమంలో వృద్ధురాలి మృతిపై అనుమానంతో మద్యం సీసా తెచ్చిచ్చిన యువకుడిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మద్యం సీసా తెచ్చిచ్చిన యువకుడు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మర్రిపాడులో వరుస చోరీలు

మర్రిపాడు, జనవరి 30 : మండలంలో ఇటీవల వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి ఇర్లపాడు పాఠశాలలో ఆరు ఫ్యాన్లు, రూ. 39వేల విలువ చేసే ఎల్ఈడీ టీవీని దొంగిలించారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తాళం పగలకొట్టి ఉండటాన్ని గుర్తించటంతో, ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల చిన్నమాచునూరులోని ప్రతాప్‌రెడికి చెందిన దుకాణంలో డ్రిల్లింగ్ మిషన్, రెండు వెల్డింగ్ మిషన్లు, అగ్రికల్చర్ మోటారుతోపాటు మరికొన్ని వస్తువులను దొంగిలించినట్లు పోలీ సులకు ఫిర్యాదు అందింది. ఈనెల 20న రాత్రి పెగళ్లపాడులో కరెంట్ కట్ చేసి రామాలయం గుడివద్ద ఉన్న నంది విగ్రహాన్ని తీసుకెళ్లారు. వరుస చోరీలతో జనం భీతిల్లుతున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేల్పుల గిరిబాబు

ఉదయగిరి రూరల్, జనవరి 30: పట్టణంలోని ఓ లాడ్జిలో మంగళవారం యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు, అన్నమయ్య జిల్లా పెనమ లూరు మండలం కంభాల కుంట గ్రామానికి చెందిన సింగనమల వెంకటేష్ (23)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో ఉదయగిరి చాకలవీధిలోని తన అక్క సైదా పురం నాగమణి వద్దకు వచ్చి ఉంటు న్నాడు. ఐదేళ్లుగా మర్రి పాడు మండలం రామానాయుడు పల్లికి చెందిన మేస్త్రీ చీమలదిన్నె రమణయ్య వెంట తెలం గాణలో బేల్దారీ పనులకు వెళుతుండే వాడు. ఈ క్రమంలో వెంకటేష్ సంక్రాంతికి మేస్త్రీతోపాటు ఉదయగిరికి వచ్చాడు. ఈనెల 14న రమణయ్య లాడ్జీలో ఓ గదిని అద్దెకు తీసుకొని తెలంగా ణకు కూలీలను తీసుకెళ్లేందుకు గ్రామాల్లో తిరుగుతున్నాడు. నాలుగు రోజుల క్రితం తన అక్క ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేష్ మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఈ విషయం మేస్త్రీకి తెలపడంతో మళ్లీ ఎక్కడి కైనా వెళ్లిపోతాడేమోనని గ్రహించి మేస్త్రీ, నాగమణి కుమారుడు కలిసి వెంకటేష్‌ను తీసుకు వచ్చి లాడ్జీలో ఉంచి బయట తాళం వేసి, టీ తాగేం దుకు వెళ్లారు. తిరిగి వచ్చి ఎంత కొట్టినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా వెంకటేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వేల్పుల గిరిబాబు తన సిబ్బందితో లాడ్జీకి చేరుకున్నారు. తలుపులను ధ్వంసం చేసి మృతదేహాన్ని కిందకు దింపి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

పొదలకూరులో క్షుద్ర పూజల కలకలం



పొదలకూరు, జనవరి 30: స్థానిక శ్రామికనగర్‌లో సమీపంలోని పొట్టేలువాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. క్షుద్ర పూజలు చేసిన ప్రదేశంలో నిమ్మకాయలు, ముగ్గుతో వేసిన బొమ్మలు, జాకెట్లు కనిపించడంతో ఆ వైపు వెళ్లాలంటేనే స్థానికులు భయపడిపోతున్నారు. ఆ ప్రాంతానికి అవతల వైపు పలు వెంచర్లు ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొనుగోలు దారులు అటువైపు వెళ్లాలంటేనే ఆందోళన చెందుతున్నారు.

క్షుద్ర పూజలు చేసిన ప్రాంతం

40 మద్యం సీసాల స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు



కొండాపురం, జనవరి 30: మండలంలోని గొట్టిగుండాలలో అక్రమంగా నిర్వహిస్తున్న రెండు మద్యం బెల్టుషాపులపై ఎస్సై ఖాజావలి సోమవారం రాత్రి, మంగళవారం దాడులు చేశారు. ఈ దాడులలో గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు వెంకారెడ్డి వద్ద 25 సీసాలు, రమణయ్య వద్ద 15 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్సై ఖాజావలి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	260
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5993
వెండి కిలో ధర	రూ. 73,900
వెండి ఒక గ్రాము	రూ. 75.90

పేకాటరాయుళ్ల అరెస్టు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 30: దుత్తలూరు రిజర్వు ఫారెస్టులో నిర్వ హిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం రాత్రి సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఉమాశంకర్ మంగళవారం తెలిపారు. ఈ దాడుల్లో ఎనిమిదిమంది పేకాటరాయుళ్లతో పాటు రూ.10,210ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సోమశిలలో 25.993 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జనవరి 30: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి జలాశయంలో 25.993 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

- నెల్లూరులోని 41వ డివిజన్‌లో రామిరెడ్డి కాలువను ఆక్రమించి అపార్ట్‌మెంట్ కడుతున్నారు. జీ+3కు అనుమతులు తీసుకొని జీ+4 కడుతున్నారు. పైన పెంట్ హౌస్ కూడా నిర్మిస్తున్నారు. దీనిపై కొందరు స్థానికులు ఫిర్యాదు చేశారు. 15 రోజులు పనులు ఆపిన కార్పొరేషన్ అధికారులు ఆ తర్వాత వదిలేశారు. అదే డివిజన్‌లో అసలు ప్లాన్ అప్రూవల్ లేకుండా 25 అంకణాల్లో ఒక కమర్షియల్ భవనం నిర్మించారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయగా అధికారులు నోటీసులు ఇచ్చి మిన్నకుండిపోయారు. పైగా ఇప్పుడు ఆ భవనంపై మరో అంతస్థు నిర్మిస్తున్నారు.
- బట్వాడిపాలెం సెంటర్లో రెసిడెన్షియల్ అనుమతులతో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేసినా అది అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి బంధువుది కావడంతో అధికారులు పట్టించుకోలేదు.
- అన్నమయ్య సర్కిల్‌లో కాలువను ఆక్రమించి ఓ కమర్షియల్ భవనం నిర్మిస్తున్నారు. జీ+2కు అనుమతులు తీసుకుని జీ+3 నిర్మిస్తున్నారు. దీనిపై కూడా కొందరు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతులు రెసిడెన్షియల్..

కట్టేది కమర్షియల్!

- భవనాల అనుమతులు, నిర్మాణాల్లో అక్రమాలు
- కనీస ప్రమాణాలు లేకపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం
- ఒక అంతస్థుకు తీసుకుని రెండంతస్థులు నిర్మిస్తున్నవైనం
- భారీగా ఆదాయాన్ని కోల్పోతున్న నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరు నగరంలో భవనాలకు అనుమతుల విషయంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయి. పన్ను తగ్గించుకునేందుకు కొందరు నిర్మాణదారులు అడ్డదారులు తొక్కుతుండగా వారికి మున్సిపల్ సిబ్బంది కొందరు సహకరిస్తుండటంతో కార్పొరేషన్ ఆదాయానికి గండిపడుతోంది. రెసిడెన్షియల్ నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం దాని మాటున కమర్షియల్ భవనం నిర్మించడం వంటి జిమ్మిక్కులు ఇటీవల కాలంలో ఎక్కువైపోయాయి. పోనీ కమర్షియల్ భవనంలోనైనా నిబంధనలు పాటిస్తున్నారా అంటే అదీ లేదు. కనీసం సెట్ బ్యాక్స్ కూడా వదలడం లేదు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రెసిడెన్షియల్ నిర్మాణాలకు తక్కువ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ కమర్షియల్ నిర్మాణాలకు మూడు, నాలుగు రెట్లు అధికంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని మిగుల్చుకునేందుకు నిర్మాణదారులు అడ్డదారులు తొక్కుతున్నారు. దీనిని అరికట్టాల్సిన యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కమర్షియల్ భవనాలకు ఫైర్ ఎన్‌వోసీ తీసుకోవాలి. కానీ అవేవీ ఉండడం లేదు. అందులోనూ తీసుకుంటున్న అనుమతులకు చేస్తున్న నిర్మాణాలకు పొంతన ఉండడం లేదు. ఒక అంతస్థుకు కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకొని రెండు అంతస్థులు నిర్మిస్తున్నారు. ఇటువంటి ఉల్లంఘనలు నగరంలో అనేకం జరుగుతున్నాయి. వీటిపై ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కానీ చేతివాటానికి అలవాటుపడిన కార్పొరేషన్ సిబ్బంది వాటి జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు మూడు, నాలుగు సచివాలయాలు ఉన్నాయి. అందులో పనిచేస్తున్న సిబ్బందికి ఎక్కడ ఏ భవనం నిర్మిస్తున్నారు..? దానికి ఉన్న అనుమతులు ఏమిటి..? అన్నది తెలుసుకోవడం పెద్ద విషయమేమీ కాదు. కానీ ఆ దిశగా ఉన్నతాధికారులు ఆలోచన చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందులోనూ ప్రతి క్వార్టర్‌కు పన్నులు విధిస్తుంటారు. అప్పుడు ఆ భవనం ఏ అనుమతులతో నిర్మాణం జరిగిందో తెలిసిపోతుంది. కానీ కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతున్నా దీనిపై దృష్టి సారించడం లేదు. ఇటీవల ట్రేడ్ లైసెన్సులపై ఏసీబీ అధికారులు దృష్టించారు. అదే క్రమంలో టౌన్‌ప్లానింగ్‌లో అనుమతులు, క్షేత్రస్థాయిలో నిర్మాణాలపై కూడా దృష్టి పెడితే మరిన్ని అక్రమాలు వెలుగుచూస్తా యన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ఈ అనధికార నిర్మాణాలపై సిటీ ప్లానింగ్ అధికారి దేవీకుమారిని సంప్రదించగా వివరాలు తెలుసుకొని పరిశీలిస్తామని చెప్పారు.



\- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

'కుష్ఠు'పై వివక్షను పారద్రోలాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు (వైద్యం) జనవరి 30 : కుష్ఠు వ్యాధిగ్రస్తులపై వివక్షను పారద్రోలాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వెంగళరావు నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధిపై సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ స్పర్శ కార్యక్రమం 15 రోజులు జిల్లాలో జరుగుతుందన్నారు. జిల్లాను కుష్ఠు వ్యాధి రహితంగా మారుద్దామన్నారు. జిల్లా కుష్ఠువ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని కోరారు. ప్రతి ఏడాది మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ లెప్రసీ అవెర్నెస్ క్యాంపెయిన్ చేపడుతున్నామని చెప్పారు. అనంతరం కుష్ఠువ్యాధిపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఐడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి

జిల్లాలో మాతా శిశు మరణాలను నివారించాలని డీఎంహెచ్‌వో పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో మాతాశిశు మరణాలపై సబ్‌కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల జిల్లాలో సంభవించిన మాతాశిశు మరణాలపై చర్చించారు. మహిళ గర్భం దాల్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పేరు నమోదు చేయించాలని, తగిన పరీక్షలు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ప్రసవించిన తల్లులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ వైద్యులు డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ రామచంద్రరావు, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐవో డాక్టర్ సెలీనాకుమారి, డాక్టర్ సింధూజ, డాక్టర్ ఉమాదేవి, డెమో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

- సెర్ప్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న సెర్ప్ సిబ్బంది

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పీ రవికుమార్ మాట్లాడుతూ గ్రాట్యు టినీ రూ.16 లక్షలకు పెంచాలని కోరారు. బేసిక్‌పై ఈపీఎఫ్‌ను 100 శాతం ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్స రాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కన్వీనర్ ఎం కృష్ణయ్య, పీ శ్రీను, చంద్రయ్య, శ్రీధర్‌రావు, కామాక్షి, రమణయ్య, రాజశేఖర్, సురేంద్రబాబు పాల్గొన్నారు.

హామీలకు ఉత్తర్వులేవీ...?

- కార్పొరేషన్ ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా



కార్పొరేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు(సిటీ), జనవరి 30 : పారిశుధ్య కార్మికుల సమ్మెను విరమింపచేసేందుకు ప్రభు త్వం ఇచ్చిన హామీలపై ఇప్పటి వరకు ఉత్తర్వులు ఇవ్వలేదని ఆక్షేపిస్తూ పారిశుధ్య కార్మికులు మంగళవారం ఆందోళనకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నాయకుడుఈ సందర్భంగా కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ హామీలపై జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పండుగ సెలవులను అమలు చేయాలని, బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్, అశోక్, కామక్షమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎస్ సీఐగా సాంబశివరావు

నెల్లూరు(క్రైం), జనవరి 30 : నెల్లూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా సాంబశివరావు నియమితులయ్యారు. గుంటూరు రేంజి పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఇటీవల సీఐగా ఉద్యోగోన్నతి పొంది, రేంజ్ వీఆర్‌లో ఉన్న సాంబశివరావును నెల్లూరుకు బదిలీ చేశారు. ఆయనకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎస్ఐగా పనిచేసిన అనుభవం ఉంది.

వారానికి నాలుగు రోజులే సాగునీరు

కలువాయి, జనవరి 30 : సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టుకు ఇకపై వారానికి నాలుగు రోజులు మాత్రమే సాగునీటిని పంపిణీ చేయనున్నట్లు ఏఈ మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళ, బుధ, గురువారాల్లో నీటిని విడుదల చేస్తామని, శుక్ర, శని, ఆదివారాల్లో నీటి విడుదలను ఆపుతామన్నారు. కుల్లూ రు, మాదన్నగారిపల్లె, పెన్నబద్వేల్, నూకనపల్లి, తెలుగు రాయపురం, తోపుగుంట అగ్రహారం, కనుపూరుపల్లి, వెరుబొట్లపల్లి, వెదనపర్తి రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. సోమశిలలో ప్రస్తుతం నీటి నిల్వలు తగ్గుతున్న కారణంగా వారబందీని అమలు చేస్తున్నామని తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

నెల్లూరు (విద్య), జనవరి 30 : ప్రభుత్వ ఉపాధ్యాయులకు కేరీర్ గైడెన్స్‌పై పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. నెల్లూరులోని రోటరీక్లబ్ భవనంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో డీఈవో గంగాభవాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేసేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాస్థాయిలో వివిధ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ రెండురోజులు కెరీర్ గైడెన్స్ శిక్షణలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులందరూ హెచ్ఎంల సహకారంతో పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర పరిశీలకుడు విజయ భాస్కర్ శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, మెల్‌బోర్న్ యూనివర్సిటీ గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సీఈవో రావ్వెల్‌ష్రాఫ్, సీమాట్ ప్రతినిధి డాక్టర్ కే శారద, సమన్వయకర్త అనూష కామి రెడ్డి, రీసోర్స్ పర్సన్ ఎస్‌వీ మంజునాథ్, పల్లిపాడు డైట్ ఉపన్యాసకులు కే విజయచంద్ర పాల్గొన్నారు.

నెల్లూరులో వస్త్రాలు, నగల ప్రదర్శన

- ఆకట్టుకుంటున్న 'సమ్మోహన' ఆభరణాలు



నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దేశం నలుమూలల నుంచి ప్రముఖ డిజైనర్లు తయారు చేసిన ఉత్పత్తులను మంగళవారం నుంచి ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించారు. కాటన్, సిల్క్, పట్టు శారీలతోపాటు యువతులకు ఉపయోగపడే డ్రస్ మెటీరియల్స్ ఆకట్టుకునే డిజైన్లు ఉన్నాయి. అలాగే ఇమిటేషన్ ఆభరణాలు, ఫ్యాన్సీ ఆభరణాలు, బ్యాగులు తదితర వస్తువులు ప్రదర్శిస్తున్నారు. కాగా, ఎగ్జిబిషన్‌లోని 24వ స్టాల్‌లో సమ్మోహన ఆభరణాలు మహిళలను ఆకట్టుకుంటున్నాయి. 92.5 ప్యూరిటీ వెండిపై బంగారు పూత ఆభరణాలను ఉత్పత్తి ధరలకే విక్రయిస్తున్నా రు స్టాల్ అధినేత ఉప్పలూరి అనూషా మాట్లాడుతూ తమ దగ్గర ఉన్నవన్నీ హ్యాండ్‌మేడ్ ఆభరణాలని అన్నారు.

బీసీలంతా టీడీపీతోనే.. : కురుగొండ్ల



యాదవులు బహూకరించిన గొర్రెపిల్లతో కురుగొండ్ల రామకృష్ణ

రాపూరు(డక్కిలి), జనవరి 30: రాష్ట్రంలోని బీసీలంతా టీడీపీతోనే ఉన్నారని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం రాపూరులో జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం మొదటి నుంచి పాటుపడింది ఒక్క టీడీపీ యేనని చెప్పారు. నాడు ఎన్టీఆర్ నేడు చంద్రబాబు బీసీల కోసం ఎంతో చేశారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగోటి నాగేశ్వరరావు, సదాశివం, మునిస్వామి, జోరేపల్లి వెంకటేశ్వర్లు రెడ్డి, ఏదోటి కోటేశ్వర నాయుడు, నువ్వుల శివరామకృష్ణ, నియోజకవర్గ జనసేన కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొగళ్లపాళెం చెరువులో వ్యక్తి గల్లంతు

నెల్లూరు రూరల్, జనవరి 30 : నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామ పంచాయతీ మొగళ్లపాళెం చెరువులో ఓ వ్యక్తి మంగళవారం గల్లంతయ్యాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు... గ్రామానికి చెందిన పులుసు పెంచలయ్య (60) తన గేదేలను తోలుకుని ఇంటికి వస్తున్న సమయంలో మొగళ్లపాళెం చెరువులోకి వాటిని తీసుకెళ్లి కడిగేందుకు అందులో దిగాడు. ఇటీవల వైసీపీ నాయకులు తవ్విన భారీ గుంతలు తెలియక ముందుకు వెళ్లడంతో అందులో చిక్కుకుని గల్లంతయ్యాడు. ఎంత సేపటికి పెంచలయ్య బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు గ్రామంలో సమాచారం అందచేశారు. ప్రస్తుతం మొగళ్లపాళెంలో అలజడి నెలకొంది. ఈ సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు అందాల్సి ఉంది. గల్లంతైన వ్యక్తికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 30: మండలంలోని బుచ్చి-జొన్నవాడ మార్గంలో చెల్లాయపాళెం వడ్డిపాళెం సమీపంలోని ఇటుక బట్టీల వద్ద మంగళవారం ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ నన్నం కేశవులు(49) ఆటో కింద ఇరుక్కుపోయాడు. ఇది గమనించిన పలువురు ఆటోను పైకిలేపి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడు కేశవులు పెనుబల్లి దళితవాడకు చెందిన వ్యక్తి. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మాదిగల సంక్షేమం కోరుకునే పార్టీలకే ఓటు

- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య మాదిగ

నెల్లూరు (హరనాథపురం), జనవరి 30 : మాదిగల సంక్షేమం కోరుకునే, రాజకీయ ప్రాధా న్యం కల్పించే పార్టీలకే మాదిగలు ఓట్లు వేస్తారని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలకు చెందిన మాదిగ నాయకులతో రౌండ్ టేబుల్ సమావే శం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదిగలను ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని ఆరోపించారు. ఫిబ్రవరి 10న నెల్లూరులోని నర్తకీ సెంటర్‌లో మాదిగల యుద్ధ భేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఇంటికి ఒకరు చొప్పున మాదిగలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డేగా రవి రాఘవేంద్ర, ఆ సంఘం జాతీయ ఉపాధ్య క్షుడు విజయకుమార్, ఎస్సీ కమిటీ మాజీ డైరెక్టర్ బద్దెపూడి రవీంద్ర, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బర్రె శ్రీనివాసులు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సాదాసీదాగా సంగం మండల సమావేశం

సంగం, జనవరి 30: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గత సమావేశంలో వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ వంటి పలు శాఖలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరించారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతుండగా జెండాదిబ్బ సర్పంచు పద్మావతి కల్పించుకుని గత సమావేవంలో సభ దృష్టికి తెచ్చిన విద్యుత్ స్తంభాల సమస్యను ఇంత వరకు పరిష్కరించలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించని సభలు, సమీక్షలు ఎందుకని నిలదీశారు. అన్ని శాఖల గురించి చర్చిస్తున్నారు, కానీ మండల పరిషత్ నిధుల వినియోగంపై సమీక్ష చేయడం లేదని వెంగారెడ్డిపాళెం సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి ఎంపీడీవో గోపీని ప్రశ్నించారు. దీంతో ఆయన మండల పరిషత్ నిధులతో చేపట్టిన పనులను గ్రామాల వారీగా వివరించారు. సుమారు రూ. 34 లక్షలతో సీసీ డ్రైన్‌లు చేపట్టినట్లు వివరించారు. అనంతరం తహసీల్దారు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ నిధుల వినియోగంపై ప్రశ్నిస్తున్న సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి

జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు : బొల్లినేని

ఉదయగిరి రూరల్, జనవరి 30: ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో సుప్రీంకోర్టు తీర్పు సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒక్కటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలు చంద్రబాబు వెంటే ఉన్నారని ఆయన తెలిపారు.

జైభారత్ నేషనల్ పార్టీకి ఓ అవకాశం ఇవ్వండి

సీతారామపురం, జనవరి 30 : జై భారత్ నేషనల్ పార్టీకి ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పాళ్ల శ్రీరామరాజు తెనిపారు. మంగళవారం సీతారామపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నీ పార్టీలకు అవకాశం ఇచ్చేనట్టే తమకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో పార్టీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తికి వినతి

ఉదయగిరి రూరల్, జనవరి 30: అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని మంగళవారం సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, కొండకిందపల్లి గ్రామాల ప్రజలతో కలిసి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీ అనుమతులు లేక దశాబ్దాలుగా నిలిచిన ఘాట్‌రోడ్డు నిర్మాణం వల్ల 16 గ్రామాల్లోని వేలాదిమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. స్పందించిన ఆయన త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

దివ్యాంగులకు బస్సు పాస్‌ల పంపిణీ

కావలి, జనవరి 30: సక్షం సంస్థ ఆధ్వర్యంలో కావలి ఆర్టీసీ డిపోలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు దివ్యాంగులు వారి సహాయకులకు రాయితీ బస్సుపాస్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ (ట్రాఫిక్) మేనేజరు కేవీఆర్ బాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, సక్షం సంస్థ కావలి ప్రతినిధులు నాగమణి, తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆమనిచిరువెళ్లలో వైద్యశిబిరం

అనంతసాగరం, జనవరి 30: మండలంలోని ఆమనిచిరువెళ్లలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం స్పర్శకుష్టు వ్యాధిపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

ఉదయగిరి రూరల్, జనవరి 30: మండలంలోని అప్పసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాలకు మంగళవారం ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి రూ.10 వేలు విరాళం అందజేశారు. పాఠశాల పురోభివృద్ధికి ఈ నగదును హెచ్‌ఎం. టీ.విజయకుమార్‌కు అందజేశారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు

వింజమూరు, జనవరి 30: పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ పాఠశాలలో మంగళవారం బోరు ఏర్పాటు చేశారు. ఎంపీపీ ఐ.మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్పంచి ఎన్.సుజన, వీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ బోరును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్పన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.వరప్రసాద్, ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు బీ జయంత్‌రెడ్డి, జూపల్లి రాజారావు, భోజనపు గోపి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలి-కడప బస్సు కొనసాగించాలి

ఉదయగిరి : ఉదయగిరి మీదుగా నడుస్తున్న కావలి-కడప బస్సును కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా కావలి డిపోకు చెందిన కడప బస్సు వయా ఉదయగిరి మీదుగా ఉండేది. ఇటీవల కావలి డిపోవారు ఆ సర్వీసును దుత్తలూరు, నందిపాడు మీదుగా కడపకు నడుపుతున్నారు. బస్సును అర్ధంతరంగా రద్దు చేయడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 30 : నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ ఆసరా సంబరాల్లో ఆయన గ్రూప్-2 ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న యువతకు సొంత నిధులతో మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారనేది వలంటీర్ల సహకారంతో వివరాలు సేకరించామన్నారు. గుంటూరు టార్గెట్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో గ్రూప్-2కు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ముందుగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలవేసి నివాళులు అర్పించారు. అనంతరం పొదుపు మహిళలకు ఆసరా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీవెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కమిషనర్ బీ నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ట్రైనీ కలెక్టర్ సచివాలయాల సందర్శన

సంగం, జనవరి 30: మండలంలోని పడమటిపాళెం, సంగం సచివాలయాలను ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై వీఆర్వోలతో చర్చించారు. సర్వర్ పనిచేయడంలేదని డిజిటల్ అసిస్టెంట్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లలో పేదలకు ఇచ్చిన జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రిజిస్ట్రేషన్ల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. కానీ సర్వర్ పనిచేయడంలేదని తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు నాగరాజు, డీటీ ప్రవీణ్ కుమార్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సంగం సచివాలయంలో పనిచేయని సర్వర్‌ను పరిశీలిస్తున్న సంజనా సిన్హా

ఎరువుల దుకాణాలు తనిఖీ

ఉదయగిరి రూరల్, జనవరి 30: పట్టణంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాకు రిజిస్టర్, బిల్లుల పుస్తకాలు, ఎరువుల నిల్వలు, తూకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్టాకు నిల్వల్లో తేడాలుంటే దుకాణాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయాధికారులు ఆంజనేయులనాయక్, వెంకటసుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్రవాడలో ధర్మప్రచార వారోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 30: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంగన్నపాళెం రామాలయంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉషశ్రీ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు బీ పెద్దభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంపై ఎంఈవో-2 విచారణ

ఉదయగిరి రూరల్, జనవరి 30: స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంపై మంగళవారం ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రమాద ఘటనపై చర్చించారు. ప్రమాదానికి గురైన స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరో ఆకతాయిలు స్టోర్‌రూమ్ ముందు నిప్పు వెలిగించి లోపలి వేసి ఉంటారని, అందువల్లే మంటలు చెలరేగి గదిలో ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములు, ఇతరత్రా వస్తువులు దగ్ధమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఇనయితుల్లా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు, జనవరి 30 : స్థానిక ఎస్‌వీ జూనియర్ కాలేజీలో మంగళవారం అపస్మా ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఏఎస్‌పేట ఠాగూర్ పాఠశాల విద్యార్థి కె మోహన్ నరేంద్ర ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సంగం వికాస్ స్కూల్ విద్యార్థి సీహెచ్ వంశీ ద్వితీయ స్థానాన్ని, చేజర్ల లుంబినీ పాఠశాల విద్యార్థి కె కృష్ణకౌసిక్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అనంతరం అపస్మా నియోజకవర్గ అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐ వేణు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు, ఎంఈవోలు నజీర్‌బాష, చలపతి, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ విజేతలకు నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో అపస్మా నేతలు ఈగ భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌వీ రమణారెడ్డి, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, రమేష్, కె కోటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ధ్యేయం : మేకపాటి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 30: మహిళాభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం వైఎస్‌ఆర్ చేయూత, సున్నా వడ్డీ, అమ్మఒడి, ఆసరా తదితర పథకాలను అమలు చేస్తుందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్‌ఆర్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, పొదుపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలస్థాయిలో నిలిచిన క్రీడా జట్లకు మేకపాటి సొంత నిధులతో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతం, ఏఎంసీ మాజీ చైర్మన్ అలీఅహ్మద్, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సంబరాలు

వింజమూరు : వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. తదుపరి మేకపాటిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాల్మన్‌రోజ్, ఏపీడీ శేషారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, సర్పంచి నల్లగొండ సుజనా, సొసైటీ చైర్మన్ మలిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడినరవలో ఆరోగ్య సురక్ష

ఉదయగిరి రూరల్, జనవరి 30: మండలంలోని తిరుమలాపురం సచివాలయ పరిధి గుడినరవలో మంగళవారం రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి శివకల్పన, సీహెచ్‌వో శివకుమారి, నాయకులు సుబ్బారెడ్డి, మహ్మద్‌ఖాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం

వింజమూరు : పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన బైక్ మెకానిక్ మహమ్మద్ రఫీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన చికిత్స నిమిత్తం మంగళవారం తోటి మెకానిక్‌లు షేక్ రసూల్, షేక్ బుడ్డా తదితరులు రూ.30వేలను రఫీకి అందజేశారు.

గాంధీకి ఘన నివాళి

కందుకూరు, జనవరి 30: గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మహీధరరెడ్డి కందుకూరులోని తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, మోదడుగు వెంకటేశ్వర్లు, రఫీ, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవిచంద్ర, సలాం తదితరులు పాల్గొన్నారు. వాసవీక్లబ్ లెజెండ్స్, వనితాక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామశివార్లలోని పేద కుటుంబాల చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, కేశవ, ఇన్నమూరి శ్రీనివాసులు, కొత్తూరి నటరాజకుమారి, నారాయణసుకన్య, లలిత, మంజుల కుమారి తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : కావలి ట్రంకురోడ్డులోని గాంధీజీ విగ్రహం వద్ద విగ్రహ వ్యవస్థాపక కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్ పర్యవేక్షణలో పలువురు ఘన నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మామిడి రామకృష్ణ, కనమర్లపూడి నారాయణయణ, అమరా వేదగిరి, సువర్ణ శ్రీని వాసులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అనుచరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పసుపులేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో నేతలు గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోతుగంటి శ్రీకాంత్, జ్యోతి బాబురావు, బీ శ్రీహరినాయుడు, కటకం రాము తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భరత్‌కుమార్, బ్రహ్మానందం, సీపీసీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో నేతలు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీ సాయి, తోట శేషయ్య, ఆలా శ్రీనాద్, బాబురావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగరం : చిలకలమర్రి ఉన్నత పాఠశాల, అనంతసాగరం ఎస్సీ ప్రాథమిక పాఠశాలల్లో గాంధీకి విద్యార్థులు ఘన నివాళులు సమర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, గ్రంథపాలకుడు నారాయణరావు పాల్గొన్నారు.

చేజర్ల : గాంధీ వర్ధంతిని చేజర్లలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండు సముదాయంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ సుబ్బారావు, దేవతి సుబ్బారావు, జనార్దన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కందుకూరు : గాంధీకి నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు, నేతలు



కావలి : నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



అనంతసాగరం : నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఉలవపాడు : ఉలవపాడు అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడుగా దాసరి ఆదిత్యరామన్‌కుమార్, కార్యదర్శిగా తాళ్లూరి సునీల్, కోశాధికారిగా దాసరి రాహుల్, ఉపాధ్యక్షుడిగా దాసరి ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా దారా కళ్యాణ్, సాంస్కృతిక కార్యదర్శిగా దాసరి వసంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

మహాత్మా.. మన్నించు !

వరికుంటపాడు : ప్రస్తుత రాజకీయ నాయకులు తమ పార్టీ నేతల జయంతి, వర్ధంతిని అంగరంగ వైభవంగా జరుపుకుంటుంటారు. అయితే మంగళవారం గాంధీజీ వర్ధంతిని అటు రాజకీయ నాయకులుకానీ, ఇటు అధికారులుకానీ జరపకపోవడం గమనార్హం. ఈ సంఘటన మండలంలోని జడదేవిలో చోటు చేసుకుంది. ఆ విగ్రహాన్ని చూసిన ఊరి జనం మహాత్మా.. మన్నించు ! అనుకుంటూ వెళ్లిపోయారు.



చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

- జలదంకి మండల సమావేశంలో సభ్యుల గగ్గోలు

జలదంకి, జనవరి 30: త్వరలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానుండడంతో అధికార వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీల్లో భయం పట్టుకుంది. నాలుగేళ్ల క్రితం జగనన్న ఇళ్ల స్థలాల చదునుకు సంబంధించిన పనులకు రూ.1.21 కోట్ల ఉపాధిహామీ బిల్లులు ఇంకా చెల్లించలేదు. ఈ క్రమం లో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ఈ బిల్లులపై గగ్గోలు పెట్టారు. గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి ఏఈ ప్రసాద్ వివరించారు. వైసీపీకి చెందిన చామదల బిట్-1 ఎంపీటీసీ పసుపులేటి అమరావతి మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం చేసిన పనులకు బిల్లులు ఎప్పుడుచెల్లిస్తారని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో సింగయ్య, ఏపీవో శ్యామల మేము చేయాల్సిన పనులు పూర్తి చేశామని, ఉన్నతాధికారులు మీ బ్యాంకుఖాతాల్లో నగదు జమచేస్తారన్నారు. ఈ సమావేశానికి జలదంకి పీహెచ్‌సీ వైద్యుడు, పలువురు అధికారులు డుమ్మాకొట్టడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వైస్ ఎంపీపీలు పాలవల్లి మాలకొండారెడ్డి, మేకల ధనమ్మ, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య

వివాదాలు వీడి సమన్వయం పాటించాలి

బిట్రగుంట, జనవరి 30: సాగునీటి విషయంలో రైతులు వివాదాలు విడిచిపెట్టి సమన్వయం పాటిస్తూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఇరిగేషన్ ఏఈ జితేంద్ర రెడ్డి అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల సచివాలయంలో స్థానిక రైతులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారకంగా 150 ఎకరాల ఆయకట్టు ఉండగా దళిత, గిరిజన, బీసీ పేదలు 60 ఎకరాలు సాగుచేస్తున్నారన్నారు. రైతులు గొడవలు వీడి పంట నష్టపోకుండా సర్దుకుపోవాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కడనూతల చెరువుకు అదనపు నీరు అందిచేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గడ్డం వెంకయ్య, శెట్టిపల్లి రమణయ్య, దాసరి శ్రీనివాసులు, ఎం.వెంకయ్య, రాధాకృష్ణారెడ్డి, చంద్ర, రవి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

కావలి, జనవరి 30 : పట్టణంలోని వివిధ సచివాలయాలలో మంగళవారం స్పర్శ కుష్టు వ్యాధిలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశాలు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి రమ్య, కావలి డివిజన్ డీపీఎంవోలు నరసారెడ్డి, వెంకటేశ్వరరావు. అర్బన్‌హెల్త్ సెంటర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీత సురేంద్రకు సన్మానం

బిట్రగుంట, జనవరి 30: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ తరుపున ఢిల్లీ రిపబ్లిక్ డేలో పాల్గొని అవార్డు అందుకున్న బోగోలు మండలం జక్కేపల్లి గూడూరు ఆర్‌బీకే వెటర్నరీ ఏహెచ్‌ఏ పందిటి సురేంద్రను మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు శ్రావణ్‌కుమార్, మహేశ్వరయ్య, మన్ననం రాజు, గౌతమ్‌లు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి జయంత్యుత్సవాలు

కందుకూరు, జనవరి 30: పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న త్యాగరాజస్వామి ఆలయంలో మంగళవారం స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీహార్ మాజీముఖ్యమంత్రి కర్పూర ఠాకూర్‌కు కేంద్రప్రభుత్వం భారతరత్న ఇవ్వటం పట్ల నాయీబ్రాహ్మణసంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు వల్లూరి కోటేశ్వరరావు, బీవీ రమణ, కరేటి వెంకటేశ్వర్లు, రాంబాబు, శ్రీహరి, యలమందరావు, సుబ్బారావు, పాల్గొన్నారు.

'నిజం గెలవాలి' విజయవంతం చేయాలి

ఉలవపాడు, జనవరి 30 : నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారని మనస్తాపంతో మృతి చెందిన కరేడు పంచాయతీలోని టెంకాయచెట్ల పాలెం మత్స్యకారుడు వాయిల సుందరరావు, మన్నేటికోటకు చెందిన ఎండ్లూరి చినకోటయ్య కుటుంబాలను సాయంత్రం 5 గంటలకు పరామర్శిస్తారని చెప్పారు.

విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యం : ఆర్టీవో

కావలి రూరల్, జనవరి 30: స్కూల్ బస్‌ల్లో విద్యార్థుల భద్రతకు రవాణాశాఖ అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి పట్టణం శాంతినగర్‌లోని శ్రీ చైతన్య సీబీఎస్‌ఈ క్యాంపస్‌లో మంగళవారం పాఠశాలలు, కళాశాలల బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నిర్దేశించిన వేగంతోనే బస్‌లు నడపాలని, తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. మద్యం సేవించి స్కూల్ బస్‌లు నడుపుతూ పట్టుబడితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుఉంటామన్నారు. పాఠశాలల నిర్వాహకులు బస్‌లు ఎప్పుడూ ఫిట్‌నెస్‌తో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుంధరరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, శ్రీ చైతన్య ప్రిన్సిపాళ్లు శైలేష్ కుమార్, శివకుమార్, డ్రైవర్లు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు : ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవీఐ) షేక్ మహమ్మద్ రఫీ సూచించారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక నక్షత్ర కాలేజీలో ప్రైవేటు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, హెల్పర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్షత్ర కాలేజీ డైరక్టర్ పోకా శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ ఒంగోలు జార్జ్, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి

కావలి రూరల్, జనవరి 30: మద్యం దుకాణాల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలని ఏవైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ప్రభుత్వ మద్యం షాపుల సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దుకాణాల వద్ద ఎలాంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తగా ఉద్యోగాలు చేసుకోవాలని హెచ్చరించారు. అనంతరం మద్యం షాపులు, బార్‌ల నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

అపస్మా ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష

అల్లూరు, జనవరి 30 : నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ పరీక్షను మండలం నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మంగళవారం నిర్వహించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.శివకుమార్ మాట్లాడుతూ అపస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలోక 33 మంది విద్యార్థులు పాల్గొనగా కావలి నలంద హైస్కూల్ విద్యార్థి జి.ధనుష్క ప్రథమ, ద్వితీయ స్థానంలో నార్తుమోపూరు శ్రీచైత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి పి.నేహ, తృతీయ స్థానంలో జయఉష హైస్కూల్‌కు చెందిన ఆర్.లక్ష్మీసుహితలు నిలిచారన్నారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపస్మా సెక్రటరీ గోపాల్‌రెడ్డి, ట్రెజరర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే మహిళల అభివృద్ధి : బీద

అల్లూరు, జనవరి 30 : వైసీపీ ప్రభుత్వంలో మహిళలు అభివృద్ధి చెందారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మంగళవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన భవన గదులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం పొదుపు మహిళలకు చెక్కును అందజేశారు. బీద మస్తాన్‌రావు అవినీతి రహిత పాలన అంటూ మాట్లాడుతుండగా అక్కడే ఉన్న ఓ రైతు అనేక పనుల్లో రూ.కోట్లు దోచుకున్నారని, ఇదంతా అవినీతి కాదా అని ప్రశ్నించగా అతడిని పోలీసులు అక్కడి నుంచి దూరంగా తీసుకెళ్లిపోయారు. దీనిపై స్థానికంగా చర్చనియాంశమైంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, నాయకులు నీలం సాయి కుమార్, దండా కృష్ణారెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, ఉస్మాన్ షరీఫ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

లింగసముద్రం, జనవరి 30 : మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 784 పొదుపు గ్రూపులకు ఈ పథకం కింద 4వ విడతలో రూ.8.47 కోట్లు మంజూరైందని చెప్పారు. అనంతరం చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, సర్పంచ్ పులి రాఘవులు, తహసీల్దారు టీ ప్రసాద్, ఎంపీడీఓ యు శేషుబాబు, ఏపీఎం కె సింహాద్రిరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బేరి రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలకు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి బారతి, ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, తహసీల్దార్ సుందరమ్మ, ఏపియం చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాలకొండలో దుకాణాలకు 2న వేలం

వలేటివారిపాలెం, జనవరి 30 : మండలంలోని మాలకొండలో దుకాణాలు ఏర్పాటు, తలనీలాలుకు లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలోని కల్యాణ మండపంలో ఫిబ్రవరి 2వ తేది ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 20 మందికి కొలువులు

కందుకూరు, జనవరి 30: టీవీఎస్ సుందరం కంపెనీ ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి ఆఫర్‌లెటర్లు అందుకున్నారని కాలేజీ టెక్నికల్ డైరక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ బ్రాంచి విద్యార్థులే లక్ష్యంగా ఈ డ్రైవ్ నిర్వహించగా 2.5 లక్షల ప్యాకేజీతో చెన్నై లోకేషన్‌లో ఉద్యోగాలు ఇచ్చేందుకు కంపెనీ ఆఫర్లు లెటర్లు ఇచ్చిందని ఆయన తెలిపారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ప్రిన్సిపాల్ డాక్టరు సిహెచ్ రవికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ హరిబాబు, మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టరు పున్నారావు విద్యార్థులను అభినందించారు.

'చలో చెన్నై' జయప్రదం చేయండి

వెంకటాచలం, జనవరి 30 : ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నిర్వహించే చలో చెన్నై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శి పీ కిరణ్ కిషోర్ కోరారు. వెంకటాచలంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 16 విద్యార్థి సంఘాలను ఒకే వేదికపైకి తెచ్చి యునైటెడ్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసి దేశంలో విద్య, ఉపాధి రంగాన్ని రక్షించే పోరాటాన్ని బలోపేతం చేయడానికి చలో చెన్నై కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు బర్ల రత్నంరాజు, నాయకులు సుకుమార్, కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

సైదాపురం ఎస్ఐగా విజయ్‌కుమార్

సైదా పురం, జనవరి 30: సైదాపురం ఎస్ఐగా డీఎస్ విజయ్ కుమా ర్ మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ చల్లా వాసు బదిలీపై వెళ్లడంతో నెల్లూరు ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

5న చలో విజయవాడ

మనుబోలు : ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు తెలిపారు. మంగళవారం మండలం లోని మడమనూరు, వీరంపల్లి కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి చలో విజయవాడ కరపత్రాలను అందించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు అంకి మనోజ్‌కుమార్, మాస ప్రసాద్, విజయడానియల్, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.





బెంగళూరు వెళ్లడానికి జగన్ సిద్ధం

• రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది • కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్


వెంకటాచలంలో వృద్ధుడితో మాట్లాడుతున్నచింతా మోహన్

పొదలకూరు, జనవరి 30 : సీఎం జగన్ అధికారాన్ని కోల్పోయి తాడేపల్లి ప్యాలెస్ నుంచి బెంగళూరులోని తన ఖరీదైన బంగళాకు వెళ్లడానికి సిద్ధమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్ నుంచి పంచా యతీ బస్టాండు వరకు ఇళ్లిళ్లు తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ బస్టాండు ఆవరణంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుంద న్నారు. చంద్రబాబు కళ్లలేని గుడ్డివాడని దుయ్యబట్టారు. ఏర్పేడు నుంచి తిరుపతి వరకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, రాజధాని ఇక్కడ పెట్టమంటే వినకుండా తుళ్లూరులో పెట్టాడన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూల చంద్ర శేఖర్, చెంచు విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాచలం : రాష్ట్ర ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ కాదని, జగన్‌మోహన్‌రెడ్డి అని చింతా మోహన్ ధ్వజమెత్తారు. వెంకటాచలంలో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు జగన్‌మోహన్‌రెడ్డి చేసిందే మి లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, దుంపల నాగరాజు, తేజోవతి, నక్కా శివ పాల్గొన్నారు.

● మనుబోలు : కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మంగళవారం మనుబోలులో పర్యటించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పూలచంద్రశేఖర్, తేజోవతి, నాయకులు మస్తాన్‌రెడ్డి, ప్రమీల, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు శైలేంద్రరెడ్డి మృతి

కోవూరు : పడుగుపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు వేమిరెడ్డి శైలేంద్రరెడ్డి(60) సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన 1994 నుంచి 2000 వరకు సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, బాలరవిలు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు.

రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్న కాకాణి : సోమిరెడ్డి


దేగపూడిలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

పొదలకూరు, జనవరి 30: వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి మండలంలో మొదటి పంటకే నీళ్లు ఇవ్వకుండా రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాడని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని దేగపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 530 ఎకరాలకు సాగునీరిచ్చే దేగపూడి ఎత్తిపోతల పునరుద్ధరణ పథకానికి 2018లో తాను శంకుస్థాపన చేసి వర్క్ ఆర్డర్ ఇస్తే కాకాణి ఆపేశారని పేర్కొన్నారు. అలాగే బండేపల్లి కాలువ అర్ధంతరంగా ఆపేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జున్ నాయుడు, సురేష్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, వీ రాజశేఖర్‌రెడ్డి, హనుమారెడ్డి జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి 5ఎస్ ఎక్సలెన్స్ అవార్డు

తోటపల్లిగూడూరు, జనవరి 30: దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ(ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్)కు ప్రతిష్టాత్మక 5ఎస్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఇటీవల నాగపూర్‌లో జరిగిన 37వ జాతీయ సదస్సులో క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఈ అవార్డును అందజేసింది. కార్యస్థలంలో సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ అవార్డు వచ్చింది. కంపెనీ తరపున ఈ అవార్డును హెచ్ఎస్ఈ టీమ్ మంగళవారం అందుకుంది. ఈ సందర్భంగా కంపెనీ టీమ్‌ను సీఈవో రాఘవ త్రివేది అభినందించారు.

ఆర్ఐవో జూనియర్ కళాశాలల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు

పొదలకూరు, జనవరి 30 : ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఆదూరు శ్రీనివాసులు మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్స్ గురించి ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపకులు, ప్రైవేటు జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో గాంధీ వర్ధంతి


ఇందుకూరుపేట : గాంధీ ఆశ్రమంలో నివాళులర్పిస్తూ..

ఇందుకూరుపేట : పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ ఆధ్వర్యంలో జరిగింది. రెడ్‌క్రాస్ ఓశాధికారి సురేష్ కుమార్‌జైన్, రెడ్‌క్రాస్ ఎంసీ సభ్యుడు ఎంవీ. సుబ్బారెడ్డి, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, ఎడవల్లి సురేష్, దాసరి రాజేంద్ర ప్రసాద్, ఆశ్రమం కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పొనక కనకమ్మ విగ్రహానికి కన్వీనర్ కల్పనమ్మ, హెచ్‌వీఎస్‌కే రంగారావు, సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కాళిదాసు పురుషో త్తం పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం పల్లిపాడుకు చెందిన దువ్వూ రు పాపిరెడ్డి సొంత నిధులతో నిర్మించిన నూతన గోశాలను ఆయన ప్రారంభించారు. రామచంద్రారెడ్డి హాస్పిటల్ డాక్టర్ పద్మ గోవును, దూడను ఇచ్చారు. అలాగే పల్లిపాడుకు చెందిన నెల్లూరు శ్రీనివాసులురెడ్డి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయనే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ కోడూరు హరినారాయణరెడ్డి, మస్తానయ్య, బి.సుధారాణి, కందికట్టు, రాజేశ్వరి, గంపల మంజుల, గంట విజయ్, శ్రీకరణం సుభాషిణి, నర్సింగరావు, ఏ.లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు జీ.శ్రీనివాసులు, సభ్యులు బాలయ్య, ఎం.రవికుమార్, బీ.సుబ్బారావు, గోవిందయ్య. బీ.వేణు, నారాయణ, గోవర్ధన్, సుమన్, తరుణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

● వెంకటాచలం : కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో గాంధీ విగ్రహానికి వీసీ సుందరవల్లి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సి పాల్ విజయానంద్‌కుమార్‌బాబు, సుజా ఎస్ నాయర్, ఎం హనుమారెడ్డి, అల్లం ఉదయ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

ఇందుకూరుపేట, జనవరి 30 : మండలంలోని పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంలో వైద్యాధికారి డాక్టర్ సీ.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చేసిన సేవలను స్మరించుకోవడంతో పాటు ఆయన ఆశించినట్లుగా సమాజంలో కుష్ఠు రోగుల పట్ల వివక్ష, చిన్నచూపుతో వ్యవహరించకుండా చూడాలన్నారు. అనంతరం వ్యాధి లక్షణాలను వివరించారు. అలాగే ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రెడ్డిపోగు సుధాకర్, డీపీఎంవో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, రమా, కమల, వరప్రసాద్, ఏఎన్ఎం దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కీర్తి విశ్వవ్యాపితం

• జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ • జాతిపితకు ఘనంగా నివాళి


జడ్పీ కార్యాలయంలో గాంధీజీ విగ్రహం వద్ద ఆనం అరుణమ్మ, అధికారులు

నెల్లూరు (జడ్పీ), జనవరి 30: దేశ స్వాతంత్య్రం, దేశ అభివృద్ధి కోసం జాతిపిత మహాత్మా గాంధీ అందించిన సేవలు, చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన కీర్తి ప్రపంచమంతా వ్యాపించిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. మహాత్మాగాంధీ 76వ వర్ధంతి సందర్భంగా జడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి అరుణమ్మ, సీఈవో చిరంజీవి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, గాంధీజీ వర్ధంతి నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువతకు గాంధీ రాజకీయ విలువలు నేర్పాలి

● టీడీపీ నేత అబ్దుల్ అజీజ్


గాంధీజీకి జోహార్లు అర్పిస్తున్న టీడీపీ నేత అజీజ్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం/వైద్యం) : రాజకీయ పార్టీలు నేటి యువతకు గాంధీ సూచించిన రాజకీయ విలువలు నేర్పించాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పిలుపునిచ్చారు. మంగళవారం ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అజీజ్ మాట్లాడుతూ స్వలాభం కోసం కాకుండా నిస్వార్థంగా సమాజం కోసం పనిచేస్తే మహాత్ములవుతారు అనేందుకు ప్రత్యక్ష సాక్షి మహాత్మాగాంధీజీ అన్నారు. అహింసతో దేనినైనా సాధించవచ్చని నిరూపించిన మహనీయుడని కొనియాడారు. అర్ధరాత్రి రోడ్డు మీద ఆడ బిడ్డ స్వేచ్ఛగా తిరిగిన నాడే అసలైన స్వాతంత్య్రం అని గాంధీజీ చెప్పారన్నారు. కానీ, జగన్ ప్రభుత్వంలో ఆడపిల్లలకి రక్షణ లేకుండా పోయిందన్నారు.

కాంగ్రెస్ నేతల నివాళి

మహాత్మాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. కనకట్ల రఘురాం ముదిరాజ్, దద్దోలు రమణయ్య గౌడ్, నలుబోలు బలరామయ్య నాయుడు, గాలి రఘురామయ్య నాయుడు, అరిగెల సాయిరాం, గరికపాటి వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

● నిరాహార దీక్షలో ఏఐవైఎఫ్ కన్వీనర్ మున్నా

నెల్లూరు (వైద్యం), జనవరి 30 : రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విభజన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కన్వీనర్ షేక్ మున్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని గాంధీబొమ్మ వద్ద మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు విడుదల చేయాలని కోరారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సయ్యద్ సిరాజ్, కిశోర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షానవాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబానికి ఎమ్మెల్యే అండ

● తక్షణ సహాయంగా రూ.10 లక్షలు


శీనయ్య సతీమణితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 30 : ఇటీవల నెల్లూరులో జరిగిన టీడీపీ రా... కదిలిరా బహిరంగ సభకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నెల్లూరు రూరల్ మండలం పాత వెల్లంటి గ్రామస్థుడు జువ్వల శీనయ్య కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 లక్షలు అందచేస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన వెల్లంటి వెళ్లి శీనయ్య కుటుంబాన్ని పరామర్శించారు. శీనయ్య కుమారుడి చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై గాయపడ్డ వారికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య, జలదంకి సుధాకర్, చక్రవర్ధన్‌రెడ్డి, కుండా మురళీరెడ్డి పాల్గొన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గంలోని ఆకుతోట, గుండ్లపాళెం, వడ్డిపాళెంలో రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 30 : నగరంలోని వేదాయపాళెంలో గల త్యాగరాజ స్వామి ఆలయంలో మంగళవారం త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం భక్తులు నగర సంకీర్తన ద్వారా భిక్షాటన చేశారు. ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, స్థానిక సంగీత కళాకారులు పంచరత్న ఘోష్టి గానం జరిగాయి. మాచవోలు భాస్కరశర్మ, వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఆరాధనోత్సవం జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నారాయణ, కోటంరెడ్డి గెలుపు ఖాయం

● పొంగూరు నారాయణ కుమార్తె శరణి


కరపత్రాలు అందజేస్తున్న శరణి

నెల్లూరు (వైద్యం), జనవరి 30 : రాబోవు ఎన్నికల్లో నెల్లూరు సిటీలో నారాయణ, రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపు ఖాయమని పొంగూరు నారాయణ కుమార్తె శరణి అన్నారు. నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీ చేయటమే తన తండ్రి లక్ష్యమని చెప్పారు. మంగళవారం నగరంలోని 8, 10 డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి నారాయణను గెలిపించాలని కోరారు. టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వైసీపీకి చెంపపెట్టన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజేతరెడ్డి, కువ్వారపు బాలాజీ, తిరుమల నాయుడు, పాలూరు శ్రీనివాసులు, కాకర్ల వెంకట్రావ్, మేరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమం సామాజిక బాధ్యత

● నారాయణ దంత కళాశాల ప్రిన్సిపాల్ అజయ్

నెల్లూరు (వైద్యం), జనవరి 30 : జంతు సంక్షేమం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రేనాల్డ్ వెల్లడించారు. మంగళవారం ఆ కళాశాలలో జంతు సంక్షేమంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పశుపక్ష్యాదులపై ప్రేమ, దయ చూపాలన్నారు. కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్ మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో పశువులు, పక్షుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని కోరారు. పెంపుడు జంతువులను రోడ్లపై వదలకుండా ఇంట్లోనే పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫర్ ఎనిమల్స్ అధ్యక్షురాలు ఉమాదేవి, డాక్టర్ వందన, డాక్టర్ రాజేష్, డాక్టర్ శరత్, డాక్టర్ ప్రతిమ, జయప్రకాష్, వెంకటలక్ష్మి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎల్వోలతో ఇబ్బంది పడుతున్నాం

● కమిషనర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

నెల్లూరు(సిటీ), జనవరి 30 : నెల్లూరు నగర నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులతో ఇబ్బందిగా ఉందని, ఓటరు జాబితా లోపాలపై వివరాలు ఇస్తే పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌కు ఫిర్యాదు చేశారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ మాట్లాడుతూ కొందరు బీఎల్వోల నిర్లక్ష్యం కారణంగా మరణించిన వారికీ ఓటరు జాబితాలో ఇప్పటికీ స్థానం ఉందని తెలిపారు. ఆ వివరాలను తాము అధికారికంగా అందచేస్తామని, విచారించి ఓటరు జాబితా నుంచి ఆ పేర్లు తొలగించాలని కోరారు. దీంతో ఆ వివరాలు తనకు అందచేయాలని, ఇబ్బంది పెడుతున్న బీఎల్వోల వివరాలు కూడా ఇవ్వాలని కమిషనర్ కోరారు. కాగా, ఇటీవల బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు అందుకున్న కమిషనర్‌ను ప్రతినిధులు సత్కరించారు.

సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు : టీడీపీ

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 30 : టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులో బెయిల్ రద్దు పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ కార్యదర్శి కనపర్తి గంగాధర్, 20వ డివిజన్ అధ్యక్షుడు దారా మల్లి అన్నారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబు తలపెట్టిన రా.. కదలిరా బహిరంగ సభకు పోటెత్తిన జనమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో నాయకులు నందిపాటి శ్యాం, నవీన్, పటాన్ జాఫర్‌ఖాన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి విశేష కుంకుమార్చన

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 30 : హిందూ ధర్మప్రచారంలో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారికి మంగళవారం రాత్రి విశేష కుంకుమ పూజలు జరిగాయి. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ మహా మృత్యుంజయేశ్వర దేవస్థానంలో ఈ కార్యక్రమం జరిగింది. లలితా సహస్ర నామ పారాయణం, కుంభహారతులు, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ప్రధాన అర్చకుడు రఘునాథశర్మ, వేద పండితుడు రామకృష్ణశర్మ పూజలు చేశారు.

ఆసరా చెక్కుల పంపిణీ

సైదాపురం,జనవరి30: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మంగళవారం సాయంత్రం వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది.జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పొదుపు మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రప టానికి పాలభిషేకం చేశారు. సైదాపురం మండల అభివృద్ధికి జెడ్పీ నిధులు ఇచ్చి తన వంతు సహాయం చేస్తానని ఆనం అరుణమ్మ తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు మన్నారపు రవికుమార్, గుంటమడుగు శ్రీనివాసులురాజు, వరదబండి ప్రభాకర్‌రెడ్డి, తిరకాల భాస్కర్, రామ్‌గోపాల్‌రెడ్డి, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆనం వల్లే అభివృద్ధి కుంటుపడింది !

రాపూరు(డక్కిలి) : ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి వల్లే వెంకటగిరి అభివృద్ధి కుంటుపడిందని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆరోపించారు. మద్దెలమడుగు సమీపంలోని ఏఎంసీ ప్రాంగణంలో మంగళవారం పొదుపు మహిళ లకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఆనంకు ఓట్లు వేసి గెలిపించారని చెప్పారు. అయితే ఆనం గెలిచాక ప్రజలను దూరం పెడుతూ వచ్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాపకన్ను మధుసూదనరెడ్డి, పాపకన్ను దయాకర రెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, నారసింహరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు

మనుబోలు: స్థానిక సచివాలయం-2 వద్ద రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళ వారం డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మండలంలోని 603 స్వయం సహాయక సంఘాలకు రూ.4.21కోట్లను ఆసరా ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో డీఆర్‌డీఏ పీడీ సాంబ శివారెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ఏపీఎం వనజాక్షి, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దువ్వూరు రాజేశ్వరి, సర్పంచు కంచి పద్మమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుమ్మళ్లదిబ్బ విద్యార్థిని ఎంపిక



కోవూరు : గుమ్మళ్లదిబ్బ జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పులిగొండల దీక్ష జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని ఛత్తీస్‌ఘడ్‌లోని కబీరాన్‌లో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని హెచ్ఎం ఇందిరాదేవి తెలిపారు. మం గళవారం పాఠశాలలో దీక్షతోపాటు ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన రావు, పీఈటీ అజయ్‌కుమార్‌ను హెచ్ఎం అభినందించారు.



పాదయాత్రకు ఘన స్వాగతం

కోవూరు, జనవరి 30 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు చింతల అశోక్‌కుమార్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం కోవూరు సరిహద్దుకు చేరింది. ఈ పాదయాత్రకు టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి, నాయకులు ఘన స్వాగతం పలికారు. వారితో కలసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెమకుల కృష్ణచైతన్య, ఇంతా మల్లారెడ్డి, నాటకరాని వెంకట్, ధారా విజయబాబు, ఉయ్యూరు వేణు, టవికుమార్, చెంబేటి పెంచలయ్య తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కలయికతో టీడీపీ విజయం

ఇందుకూరుపేట, జనవరి 30 : జనసేన, టీడీపీ కలయికతో టీడీపీ విజయం సాధిస్తుందని టీడీపీ కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మైపాడులో మంగళవారం జనసేన కోవూరు నియోజకవర్గ పరిశీలకులు గుడి హరికుమార్‌రెడ్డి నిర్వహించిన పల్లెనిద్ర పాదయాత్ర ముగింపు సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోలంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు టీడీపీ జనసేన నాయకులు కలిసి పనిచేయాలని కోరారు. పోలీసు వ్యవస్థను వైసీపీ కార్యకర్తలు లాగా వాడుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, చెముకుల కృష్ణచైతన్య, గంపల అనిల్‌కుమార్, గుండాల కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 31 జనవరి 2024



సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నిర్ణయం జిల్లా అధికార పార్టీపై పిడుగుపాటులా పరిణమించింది. ఆయన వ్యవహారం వైసీపీని కుదిపేస్తోంది. అధికార పార్టీలో తాను ఎదుర్కొన్న అవమానాలు, మానసిక క్షోభను ఆదిమూలం వెల్లడించిన వైనం బడుగు బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అదే సమయంలో వైసీపీ అధిష్ఠానాన్ని ఆయన ధిక్కరించిన తీరు, మంత్రి పెద్దిరెడ్డిపై తిరుగుబాటు జరిపిన వైనం రాయలసీమ వ్యాప్తంగా పెద్దిరెడ్డి ప్రాబల్యాన్ని పలుకుబడిని దెబ్బతీసింది.

వైసీపీలో దళిత ధిక్కార స్వరం

- అధికార పార్టీని కుదిపేస్తున్న ఆదిమూలం స్పందిస్తున్న తీరు
- బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇంతవరకూ వైసీపీలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆ స్థాయి నేతలెవరూ అధిష్ఠానాన్ని ధిక్కరించింది లేదు. ప్రాధాన్యత ఇవ్వలేదని ఒకరిద్దరు నేతలు పార్టీని వీడినా అధిష్ఠానాన్ని విమర్శించింది గానీ, తప్పు పట్టిందిగానీ లేదు. మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషాకు టికెట్ నిరాకరించినా ఆయన మౌనంగానే వున్నారు. చిత్తూరులో సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులుకు టికెట్ లేదంటూ, రాజ్యసభ టికెట్ ఆశచూపినా ఆయనా గుంభనంగా వున్నారు తప్పితే స్పందించలేదు. ఇక గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాద రావుకు టికెట్ గల్లంతైనా ఆయన సైతం అంతర్గతంగా కొందరిని కలవడం తప్ప ఇప్పటి వరకూ పార్టీకి వ్యతిరేకంగా పెదవి విప్పలేదు. తిరుపతి సిటింగ్ ఎంపీని సత్యవేడు అసెంబ్లీకి పోటీచేయమని ఆదేశించినా ఆయన సైతం నోరు మెదపకుండా సత్యవేడులో పర్యటనలు ప్రారంభించారు. జీడీనెల్లూరులో సిటింగ్ ఎమ్మెల్యే నారాయణస్వామికి టికెట్ లేదని, చిత్తూరు ఎంపీగా పోటీ చేయమని ఆదేశిస్తే డిప్యూటీ సీఎంగా వుండి ఎంతో సీనియర్ అయినా కూడా ఆయన తల వంచి అంగీకరించారు. చిత్తూరు ఎంపీకి సైతం టికెట్ ఇవ్వకుండా జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమంటే ఆయన సైతం అధిష్ఠానం ఆదేశాలను మౌనంగా తలదాల్చారు. పూతలపట్టులో సిటింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ తిరస్కరించినా మంత్రి పెద్దిరెడ్డిని నిష్టూరం చేసి అంతలోనే క్షమాపణలు చెప్పారు. నగరిలో మంత్రి రోజాకు టికెట్‌పై ఇప్పటి వరకూ స్పష్టమైన హామీ లేకపోయినా ఆమె కూడా ఓపికగానే నిరీక్షిస్తున్నారు. సూళ్ళూరుపేటలో సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ ఇవ్వవద్దని బలమైన వర్గం పట్టుబట్టినా అధిష్ఠానం ఖాతరు చేయకుండా ఆయనకే టికెట్ ఖరారు చేసింది. అయినా ఎమ్మెల్యేని వ్యతిరేకిస్తున్న వర్గం అధిష్ఠానాన్ని తప్పుపట్టే సాహసం చేయలేదు. పాత, కొత్త జిల్లాల్లో కుప్పం నుంచీ గూడూరు దాకా ఎలా చూసినా ఎవరూ పార్టీపై ధిక్కార స్వరం బహిరంగంగా వినిపించిన వారు గానీ, పార్టీని వీడిన వారు గానీ ఇప్పటి దాకా ఎవరూ లేరు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వ్యవహరించిన తీరు పార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. ఎమ్మెల్యే టికెట్ లేదని చెప్పినా, అంతకంటే పెద్దస్థాయిలో తిరుపతి ఎంపీగా పోటీచేసే అవకాశం దక్కినా ఆయన తృణప్రాయంగా తిరస్కరించిన తీరును పార్టీ పెద్దలు జీర్ణించుకోలేకపోతున్నారు. దానికి తోడు ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం పార్టీకి పిడుగుపాటుగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తొలి వికెట్‌ను కోల్పోవడంతో పాటు ఆయన చేసిన ఆరోపణలు పార్టీని కుదిపేస్తున్నాయి.

బలహీనపడుతున్న పెద్దిరెడ్డి ప్రాబల్యం

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎదురు దాడితో ఇంతకాలం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగిన మంత్రి పెద్దిరెడ్డి ప్రాబల్యం బద్దలైంది. 2014లో పలమనేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల నుంచీ వైసీపీ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఏవీ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తర్వాత కొంత కాలం కూడా పార్టీలో వుండలేకపోయారు. అప్పట్లో వారు పార్టీని వీడడానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డే కారణమన్న ప్రచారం జరిగింది. అయినా ఆ ఇద్దరూ అప్పట్లో పెద్దిరెడ్డిపై బహిరంగ ఆరోపణలు గానీ, విమర్శలు గానీ చేయలేదు. అమర్ టీడీపీలో చేరి మంత్రిగా కూడా పనిచేయగా ప్రవీణ్ రాజకీయాలకే దూరమయ్యారు.2019 ఎన్నికల్లో పూతలపట్టు నుంచీ నాటి సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌కు టికెట్ గల్లంతు కాగా ఆయన జగన్ ఇంటి ఎదుట బోరుమని విలపించారు తప్పితే మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించలేదు. ఆ ఎన్నికల్లోనే మదనపల్లెలో సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి టికెట్ గల్లంతైనపుడు కూడా ఆయనా పెద్దిరెడ్డిపై విమర్శలు చేయలేదు. ఇప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో ఎన్ని మార్పుచేర్పులు జరిగినా బాధిత ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనంగా సహిస్తున్నారు తప్పితే పెద్దిరెడ్డి వైపు వేలెత్తి చూపే సాహసం చేయలేదు. అలాంటిది సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం నేరుగా మంత్రి పెద్దిరెడ్డిని ఉద్దేశించి అవినీతి, అక్రమాల ఆరోపణలు చేయడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. జిల్లావ్యాప్తంగా పెద్దిరెడ్డి వర్గీయులు దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీ టికెట్ కూడా వద్దని బహిరంగంగా తిరస్కరించడం పెద్దిరెడ్డి వర్గం అహాన్ని దెబ్బతీస్తోంది. అంతకు మించి ఏకంగా పార్టీని వీడి టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను కలవడం, ఆ క్రమంలో పెద్దిరెడ్డికి హెచ్చరికలు చేయడంతో మంత్రి ప్రాబల్యం దారుణంగా దెబ్బతిన్నట్టవుతోంది. పెద్దిరెడ్డిని వ్యతిరేకించే వైసీపీ వర్గాలు ఆదిమూలం ధైర్యానికి, తెగింపుకు లోలోన సంబరపడుతుండడం గమనార్హం. ఇంతకాలం ఇతర మంత్రుల నియోజకవర్గాల్లో కూడా జోక్యం చేసుకుని వారికి నిద్రాహారాలు కరువు చేసిన వైనం తలచుకుంటున్న వ్యతిరేక వర్గీయులు ఇపుడు ఓ దళిత ఎమ్మెల్యే మూలంగా తగిన మూల్యం చెల్లించుకుంటున్నారని సంబరపడుతున్నారు.

బడుగు వర్గాలపై తీవ్ర ప్రభావం

కారణాలు ఏవైనప్పటికీ జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ దళిత సామాజికవర్గాల్లో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి హీరో వర్షిప్ వచ్చినట్టవుతోంది. రాష్ట్రంలో పలుచోట్ల ఇతర సామాజికవర్గాలు వైసీపీ అధిష్ఠానంపై తిరుగుబాటు చేసిన ఉదంతాలున్నా దళిత వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచీ ఆ పరిస్థితి ఎదురుకాలేదు.అలాంటి పరిస్థితుల్లో ఆదిమూలం ఎగరేసిన తిరుగుబాటు బావుటా ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల్లో విపరీతమైన చర్చకు దారి తీస్తోంది. ఎమ్మెల్యే టికెట్ నిరాకరించినా అంతకు మించిన ఎంపీ టికెట్ ఆఫర్ చేసినా ఆదిమూలం తిరస్కరించిన తీరు, తనకు పదవి, అధికారం కంటే ఆత్మగౌరవం ముఖ్యమని ప్రకటించిన వైనం అట్టడుగు సామాజికవర్గాలను కదిలిస్తోంది. తాను తప్పేమీ చేయకుండానే తనకు ఎమ్మెల్యే టికెట్ నిరాకరించడం పట్ల ఆయన తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.దీన్ని ఇతరుల్లా దాచుకోకుండా బహిరంగపర్చడం ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాలకు దళిత ఎమ్మెల్యేలు పడుతున్న క్షోభ తెలిసివస్తోంది.ఎస్సీ ఎమ్మెల్యేలను, ఎంపీలను టికెట్ల పేరిట తీవ్రంగా వేధిస్తున్న విషయం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలు స్థానాల్లో నిరూపితమైన నేపథ్యంలో ఆయా సామాజికవర్గాల్లో అధికార పార్టీ పట్ల తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. దానికి ఆదిమూలం తెగువ ఆజ్యం పోసినట్టయింది. ఈ పరిణామాలు అంతిమంగా ఎన్నికల్లో అధికార పార్టీకి తీవ్ర నష్టం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తిరుమలలో పెరిగిపోతున్న వరాహాల సంచారం

తిరుమల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోజురోజుకూ శునకాలతోపాటు వరాహాల (పందులు) సంచారం పెరిగిపోతోంది. జనసంచారంలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కొద్దిరోజుల ముందు వరకు కాటేజీలు, రోడ్లు, హోటళ్ల ముందు మాత్రమే కనిపించేవి, ఇప్పుడు ఏకంగా ఆలయం సమీపానికే వచ్చేస్తున్నాయి. తాజాగా మంగళవారం వేకువజామున రెండు వరాహాలు ఆలయ సమీపంలో భక్తుల మధ్యే తిరిగాయి. అయినా సిబ్బంది పట్టించుకోక పోవడం గమనార్హం.



అగ్రరాజ్యంలో మెరిసిన అనంత రవి తేజం

- అమెరికాలో ఈబీ-1 వీసీ పొందిన తిరుపతి యువకుడు
- యాపిల్ కంపెనీ రీసెర్చ్ సైంటిస్ట్‌గా రూ. 5.3 కోట్ల వార్షిక వేతనం



యాపిల్ కంపెనీ సీఈవో టిమ్ కుక్‌తో..

తిరుపతి రూరల్, జనవరి 30: అగ్రరాజ్యం అమెరికాలో అనంత రవితేజ అనే తెలుగు యువకుడు మెరిశాడు. తిరుపతికి చెందిన ఇతను ఈబీ-1 వీసా (ఐన్‌స్టీన్ వీసా) పొందాడు. అసాధారణ ప్రతిభను చూపిన వ్యక్తులకు మాత్రమే ఇలాంటి గుర్తింపు లభించడం గమనార్హం. దీనిపై తిరుపతి నలంద నగర్‌లో ఉంటున్న ఈయన తల్లిదండ్రులు నీలిమ, రమేష్ నాయుడితోపాటు నగరవాసులూ హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ కుమారుడికి ఈబీ-1 వీసా రావడం సంతోషంగా ఉందన్నారు. తమ స్వగ్రామం చంద్రగిరి మండలం పుల్లయ్యగారిపల్లె అని తెలిపారు.

జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేస్తా



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి లోతైన పరిశోధన చేయాలని ఉంది. దీనిద్వారా అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా జీవన ప్రమాణాల పెంపొందించేందుకు కృషి చేస్తా. ఇందుకోసం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి.. తద్వారా ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయాలని భావిస్తున్నా.

\- అనంత రవి తేజ

ప్రస్థానమిలా..

తిరుపతి బాలాజీ కాలనీలోని కేంబ్రిడ్జ్ స్కూల్లో రవితేజ ప్రాథమిక విద్యాభ్యాసం, బెంగళూరులో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్, న్యూయార్క్ యూనివర్సిటీలో ఎంఎస్, హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేశారు. తొలుత అమెరికాలో బ్లూబర్గ్ కంపెనీలో రీసెర్చ్ ఇంజనీర్‌గా ఏడాదిపాటు పనిచేశారు. వాషింగ్టన్ స్టేట్‌లో ఉన్న యాపిల్ కంపెనీలో పలు స్థాయిల్లో పనిచేసి, రూ.5.3 కోట్ల వార్షిక వేతనంతో ఏడాది కిందట ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పదోన్నతి పొందాడు. ఈక్రమంలో రవితేజకు ఈబీ-1వీసా మంజూరు చేయాలన్న యాపిల్ కంపెనీ చేసిన విన్నపాన్ని అమెరికన్ ప్రభుత్వం ఆమోదించింది. ఈబీ-1 వీసీ ద్వారానే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అమెరికాలో అడుగు పెట్టారు. అమెరికన్ జర్నల్స్‌కు పదబంధాల(క్రాస్ వర్డ్స్)ను రూపొందించిన ముంబై వాసి మంగేష్ గోగ్రేకు కూడా ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈబీ-1 వీసాను ప్రకటించిన విషయం తెలిసిందే.

సర్పంచులకు నిధులు, విధులు ఇవ్వకుంటే గద్దె దింపుతాం

- వైసీపీ ప్రభుత్వానికి పంచాయతీరాజ్ చాంబర్ హెచ్చరిక



నిరసన శిబిరంలో ప్రసంగిస్తున్న సింగంశెట్టి సుబ్బరామయ్య

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 30: సర్పంచులకు నిధులు, విధులు ఇవ్వకుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య హెచ్చరించారు. గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుతో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సింగంశెట్టి మాట్లాడుతూ.. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,639.79కోట్లను నవరత్నాల పథకాలకు సీఎం జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేక సర్పంచులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇంకొన్ని చోట్ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిస్తే ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అప్పులు చేసి సర్పంచులే పనులు చేశారన్నారు. వారికి కూడా బిల్లులు చెల్లించకుండా అప్పుల పాలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే చలో విజయవాడకు పిలుపునిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా సర్పంచులు మహేష్, శివకుమార్, లక్ష్మీప్రసన్న, లక్ష్మీదేవి, రెడ్డెప్పనాయుడు, శశికళ, రమణ, వెంకటరమణ, సురేష్, చాంబర్ సభ్యులు రాము, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు చివరి వేలిముద్ర లేదిక

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 30: ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ విక్రయదారుల నుంచి చివరి వేలిముద్ర స్వీకరణకు ప్రభుత్వం మంగళం పాడింది.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు క్రయవిక్రయదారుల ఫొటోలు, వారి ఆధార్‌కార్డు నెంబర్లతో దస్తావేజు తయారవుతుంది. ఈకేవైసీ చేశాక క్రయవిక్రయదారులు వేలిముద్రలు వేస్తారు.దానిపై సబ్‌రిజిస్ట్రార్ ఈ-సైన్ చేస్తారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలో క్రయవిక్రయదారులు చివరిసారిగా వేలిముద్రలు వేస్తారు. దస్తావేజులు నిబంధనల మేర ఉన్నాయంటూ సబ్‌రిజిస్ట్రార్ సంతృప్తి పొంది ఈ-సైన్ చేయడంతో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అయితే తొలిసారి వేసిన వేలిముద్రే సరిపోతుందని తాజాగా చట్ట సవరణ జరిగింది.

ఏడు పాఠశాలలకు 'హరిత' అవార్డులు



అవార్డు అందుకున్న టీచర్లు - అవార్డు అందుకుంటున్న నీలకంఠయ్య

- జాతీయస్థాయి అవార్డు అందుకున్న నీలకంఠయ్య

తిరుపతి(విద్య), జనవరి 30: న్యూఢిల్లీలోని ఇండియన్ హాబిటేట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రీన్ కార్నివాల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉత్తమ హరిత పాఠశాలలుగా ఎంపికైన ఏడు స్కూల్స్‌కి సంబంధించిన గ్రీన్ టీచర్లు అవార్డులు, ధ్రువపత్రాలను అందుకున్నారు. ఈమేరకు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) డైరెక్టర్ సునీత అగర్వాల్ చేతులమీదుగా ఈ అవార్డులు అందుకున్నట్లు ఒకప్రకటనలో పేర్కొన్నారు. అలాగే జాతీయ స్థాయిలో గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో రాష్ట్రం తరఫున ఉత్తమ ప్రదర్శన చేసిన ఎన్జీసీ స్టేట్ కో-ఆర్డినేటర్, కరకంబాడి జడ్పీ హెచ్ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్య జాతీయస్థాయి అవార్డు అందుకున్నట్లు ప్రకటించారు. కాగా.. రాష్ట్రంలోని 6,500పాఠశాలల్లో ఎకో క్లబ్స్ ఉన్నాయని, ఈఏడాది నుంచి ప్రైమరీ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎన్జీసీ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి తెలిపారు.

ఉద్యోగం చేయలేకపోతే తప్పుకోండి

ఉపాధి కల్పనలో అలసత్వంపై డ్వామా పీడీ మండిపాటు ● రూ.2,57లక్షల రికవరీ, రూ.52,186 జరిమానా

ఓజిలి, జనవరి 30: ఉపాధి పనుల కల్పనలో అలసత్వం చూపితే సహించేది లేదని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఓజిలిలో మంగళవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల వారీగా జరిగిన ఉపాధి పనులు, చెల్లింపులు, సిబ్బంది పనితీరును నివేదికల ఆధారంగా పరిశీలించారు. 8.12 కోట్ల రూపాయల వ్యయం చేసి 3.74 లక్షల పనిదినాలను చేపట్టారు. ఈ క్రమంలో జరిగిన పనులపై పంచాయతీల వారీగా నివేదికలను పరిశీలించారు. ఈసీ మెంబర్లు, క్షేత్ర సహాయకుల పనితీరుపై డ్వామా పీడీ మండిపడ్డారు. ఉపాధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనిచేయించాల్సిన ఏపీవో పనితీరు సరిగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయలేకపోతే తప్పుకోవాలని, లేదంటే సస్పెండ్ చేయాల్సివస్తుందని హెచ్చరించారు. కనీసం జాబ్ కార్డులు కూడా ఇవ్వడంలో నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. కార్డులు లేకపోతే తెల్లపేపర్‌లోనైనా పేర్లు నమోదు చేసి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయకపోవడంపై కూడా ఆయన మండిపడ్డారు. జరిగిన పనులకు సంబంధించి కొలతలు కూడా తీసుకోవడం చేతకాని సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారా అంటూ ఆశ్చర్యపడ్డారు. ఎవరూ సక్రమంగా పనిచేయడంలేదని, ఇలాంటి తప్పులు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో జరిగిన వివిధ పనులకు సంబంధించిన అవకతవలపై రూ.2,57,590 రికవరీకి ఆదేశించారు. అదేవిధంగా రూ.52,186 జరిమానా కింద నమోదు చేశారు. రాచపాళెంలో అత్యధికంగా రూ.83,146 రికవరీ ఉండగా, రెండవ స్థానంలో ఇనుగుంట రూ.68,639, మూడవ స్థానంలో భట్లకనుపూరు రూ.23,671) రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ ఏపీడీ ఉషారాణి, అంబుడ్స్‌మెన్ రాసరాయ నాయుడు, ఎంపీడీవో రజనీకాంత్, ఓజిలి ఏపీవో ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు, వైసీపీ మండల కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి, వైసీపీ నాయకులు దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సభలో నివేదికలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు

టీడీపీతోనే మహిళా సాధికారత



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

గూడూరు, జనవరి 30: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక శాంతినగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు పెద్దపీట వేసేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. మహిళలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి ద్వారా 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదవుకునే పల్లలందరికీ ఒక్కోక్కరికీ ఏడాది రూ.15వేల వంతున ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, గోను శివ కుమార్, గురవయ్య, శివ, రవీంద్రరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శైలజ, సుబ్బమ్మ, శ్రీదేవి, కల్పన, సుధా, లక్ష్మి, రేవతి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: కురుగొండ్ల



సదస్సులో శంఖం ఊదుతున్న కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, జనవరి 30: టీడీపీతో బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం డక్కిలిలో నిర్వహించిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు కూడు, గూడు, గుడ్డ వంటి కనీస అవసరాలు తీర్చేందుకు దివంగత నేత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి కులవృత్తులను ప్రోత్సహిస్తే, చంద్రబాబునాయుడు బీసీల అభున్నతికి ఎంతగానో కృషిచేశారని చెప్పారు. బడుగు బలహీన వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారిని అన్నివిధాల ఆదుకోవడం జరిగిందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీసీలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపై నిలబడి తమ సత్తా ఏమిటో జగన్‌కు చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సదాశివం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మునిస్వామి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు చెలికం భాస్కరరెడ్డి, కుమార్ యాదవ్, పోకూరు రమేష్, పీపీ చౌదరి, శివప్రసాద్, సుభాన్ చంద్రబోస్, పోట్టా మునెయ్య, సుబ్రహ్మణ్యం, డక్కిలి చంద్రారెడ్డి, పెంచలరెడ్డి, పిల్లి శ్రీనివాసులు రెడ్డి, గరిటి చెంచయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌వన్నీ బూటకపు మాటలే: పాశం



టీడీపీలో చేరిన యువతతో పాశం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ చెప్పేవన్నీ బూటకపు మాటలేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక అరుంధతీయ పాళెం ప్రాంతానికి చెందిన గోవిందువాసు ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మాటతప్పారన్నారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో యువతకు భరోసా కల్పించారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామని మినీమేనిఫెస్టోలో చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, చంద్రమౌళి, వాసుదేవ, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, సాయి, పవన్, కార్తీక్, రహీం, మురళి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండాగుంట గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర్లురాజు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల దీక్షకు టీడీపీ నేతల మద్దతు



సర్పంచులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, జనవరి 30: సర్పంచులకు అధికారాలు, విధులు, నిధులతో పాటు 16 డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ పార్టీలకు అతీతంగా సర్పంచులు చేపట్టిన నిరాహార దీక్షకు పెళ్లకూరు టీడీపీ నేతలు మద్దతు పలికారు. మంగళవారం నెల్లూరులో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు పెళ్లకూరు మండలానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవకోలు మునీష్ మద్దతు పలికారు. దీక్షలో శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య, టీడీపీ నాయకుడు రెడ్డాం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కోసమే వికసిత్ భారత్

వెంకటగిరిటౌన్, జనవరి 30: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానంలో వికసిత్ భారత్ డిజిటల్ వ్యాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రమణయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30: జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి.. గృహ నిర్మాణశాఖ ఎండీగా బదిలీ అయ్యారు. మంగళవారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయంలో లక్ష్మీషాకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవోలు రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్యతో పాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాక, కలెక్టర్‌గా లక్ష్మీషా బాధ్యతలు స్వీకరించనున్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

గూడూరు, జనవరి 30: గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనంతపురం నగరపాలసంస్థ ఉపకమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

తక్కువ వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలు

వెంకటగిరిటౌన్, జనవరి 30: రైతులకు తక్కువ వడ్డీ రేటుతో వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని ఎన్‌డీసీసీబీ సీఈవో సూరపనేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక బ్యాంకులో రీజనల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 444 రోజుల నగదు డిపాజిట్‌లపై రూ.7.75 వడ్డీ అందిస్తున్నామని, సీనియర్ సిటిజన్లకు 0.50శాతం అదనంగా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు సరిత, చంద్రశేఖర్, టీ.రాజా, నిరుపమాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్స్, సింగిల్ విండోల సీఈవోలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

పట్టణంలో వీధిలైట్లు కూడా వెలగడం లేదు ● కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి, సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ లక్ష్మమ్మ

సూళ్లూరుపేట, జనవరి 30: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని కౌన్సిలర్లు అన్నారు. పట్టణంలోని గాండ్లవీధిలో ఉన్న స్త్రీ స్వశక్తి భవనంలో మంగళవారం మున్సిపాలిటీ సాధారణ బడ్జెట్ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పలు అంశాలపై చర్చించి బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 16వ వార్డు కౌన్సిలర్ లక్ష్మమ్మ మాట్లాడుతూ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రతి సమావేశంలో తాము అడుగుతున్నామో అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కనీసం వీధి లైట్లు కూడా వెలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ పోలూరు పద్మ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో విద్యుత్ స్తంభాలు మార్చాలని చెప్పినా పట్టించుకోవడంలేదని, విద్యార్థులు తిరిగే స్థలంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇలాగైతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎన్‌టీ రోడ్డు సమీపంలో వినాయకుడి గుడి వద్ద కల్వర్టు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కల్వర్టును వెంటనే నిర్మించాలని మరో వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ కోరారు. చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరమైన చోట్ల డ్రైన్లు, సిమెంటు రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ నరేంద్రకుమార్, మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 30: ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని గెలిపించి తప్పుచేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. రా.. కదలిరా... సభలతో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టి ప్రజలను చైతన్య పరుస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని, వైసీపీ పాలన పట్ల ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవధానం సుధీర్, సుంకర కృష్ణయ్య, వెంపల్లి వెంకటేశ్వర్లు యాదవ్, సుజాతమ్మ, కిష్టయ్య, చక్రపాణి, ముత్యాలయ్య, మొండెం బాబు, ప్రసాద్‌రాజు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ శిక్షణ తరగతులు

కోట, జనవరి 30: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూఏ స్థాయి టేబుల్ టెన్నిస్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టేబుల్ టెన్నిస్ పురుషుల విభాగం టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 27నుంచి శిక్షణ తరగతులు నిర్వహించారు. కడప నుంచి రెడ్డిమోహన్, ఇమ్రాయిన్, రాజంపేట నుంచి సాయికృష్ణ, సాయికృష్ణారెడ్డి, జేఎన్‌టీయూఏ యూనివర్శిటీ నుంచి కృష్ణ శిక్షణలో పాల్గొన్నారు. వీరు ఫిబ్రవరి 1నుంచి చెన్నైలోని తమిళనాడు కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ శోభారాణి, రామ్‌కుమార్ షీల్డ్‌లతో అభినందించారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

గూడూరు, జనవరి 30: మండలంలోని మేగనూరు గ్రామంలో మంగళవారం కొందరు తెల్లరాయిని అక్రమంగా తవ్వకాలు సాగిస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనింగ్‌కు సంబంధించి 2016లోనే అనుమతులు ముగిశాయన్నారు. అయితే కొద్దిరోజులుగా అక్రమంగా తవ్వకాలు సాగిస్తుండడంతో గ్రామానికి చెందిన మేతపోరం బోకు భూములు గోతుల మయంగా మారుతున్నాయన్నారు. అధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌ను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

గూడూరు, జనవరి 30: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు, కళాశాల బస్సు డ్రైవర్లుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, అతివేగంగా వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సునీల్, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోండి

చిల్లకూరు, జనవరి 30: ఉపాధి కూలీల సంఖ్య పెంచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కమ్మవారిపాళెం గ్రామంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించడంతో పాటు గిట్టుబాటు కూలి రూ.272 వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న పాలకవర్గం

సూళ్లూరుపేట, జనవరి 30: మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్‌ను చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది మంగళవారం సన్మానించారు.

ఎంఈవోకు సత్కారం



ఎంఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డక్కిలి, జనవరి 30: డక్కిలి ఎంఈవో పిన్నక జగదీష్ బాబును ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంఈవో జగదీష్ బాబు ప్రశంసాపత్రం అందుకున్నారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఎంఈవోను సత్కరించారు. ఎంపీడీవో ప్రసన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీవీ రెడ్డి, గంగాధరం, తాళ్లూరు శ్రీనివాసులు, గంగారావు, ముత్యవేలు వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాసులు, అబీద్, నాగభూషణం, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి నివాళి

వెంకటగిరిటౌన్, జనవరి 30: పట్టణంలోని తూర్పువీధి ఉన్న గ్రంథాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అంజయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెందోడులో భవిష్యత్తుకు గ్యారెంటీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 30: మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు చల్లా శ్రీనివాసులు, కోటా శ్రీనివాసులును చెందోడు, వడ్డిపాళెం, దళితవాడల్లో ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలపై అవగాహన కల్పించారు.

వైసీపీ యూత్ జిల్లా సెక్రటరీగా రవీంద్ర

వాకాడు, జనవరి 30: వైసీపీ యూత్ జిల్లా సెక్రటరీగా వాకాడు మండలం అల్లూరుకొత్తపాళెం గ్రామానికి చెందిన రాయపు రవీంద్ర నియమితులయ్యారు.

విశాఖపట్నం డీపీటీవోపై చర్యలు తీసుకోవాలి

గూడూరు, జనవరి 30: విశాఖపట్నం ఆర్టీసీ డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎమ్‌యూఏ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిపో వద్ద ఎన్ఎమ్‌యూఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్ఎమ్‌యూఏ నాయకులను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించేందుకు కారణమైన డీపీటీవోపై చర్యలు చేపట్టాలన్నారు.

వైద్యం అందించలేదంటూ బాధితుల ఆరోపణ

నాయుడుపేట టౌన్, జనవరి 30: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా అందించలేదంటూ బాధితులు ఆస్పత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని అమరా గార్డెన్‌లో నివాసం ఉంటున్న అప్షాబి అనే మహిళ సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. తరువాత ఆ మహిళ పరిస్థితి బాగాలేదంటూ చెన్నైకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో అమరా గార్డెన్‌లోని ముస్లింలు ఆస్పత్రి వద్దకు చేరుకొని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆపరేషన్ చేసిన సమయంలో వైద్యం సరిగా అందించకపోవడంతో పరిస్థితి వికటించిందని ఆరోపించారు.

ఉపాధి పనుల్లో జిల్లాకు మొదటిస్థానం

కోట, జనవరి 30: ఉపాది పనుల్లో జిల్లా మొదటిస్థానంలో ఉందని డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. కేశవరం పంచాయతీలోని చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. కూలీలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 35వేల కుటుంబాలకు 1.20కోట్ల పనిదినాలు కల్పించామన్నారు. ఆయనవెంట ఏపీవో పూర్ణిమ, క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

సాదాసీదాగా మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్

కోట, జనవరి 30: కోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. మండలంలోని మొత్తం 16 మంది ఎంపీటీసీలకు గాను 6మంది మాత్రమే హాజరు కాగా, అందులో ముగ్గురు టీడీపీ వారే. అదేవిధంగా 21 పంచాయతీలుండగా కొత్తపట్నం సర్పంచు తిరుపాలయ్య, చిట్టేడు సర్పంచు రాఘవయ్య మాత్రమే హాజరయ్యారు. టీడీపీ ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, నారాయణ పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. కోట పట్టణం, నెల్లూరుపల్లి కొత్తపాళెంలో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ కోటయ్య, వైస్ ఎంపీపీలు కుప్పల శేషయ్య, వేమారెడ్డి సౌజన్యరెడ్డి, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతి, ఎంఈవో మస్తానయ్య, కోఆప్షన్ సభ్యుడు మోబిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్: చింతా మోహన్



తిన్నెలపూడిలో మాట్లాడుతున్న చింతా మోహన్

కోట, జనవరి 30: సీఎం జగన్ దళిత ద్రోహి అని, ఆయనను వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఏకమై ఓడించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ, చెంబడిపాళెం గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ కోడికత్తి ఘటనలో కత్తే లేదని, అదంతా ఎన్నికల్లో ఓట్ల కోసం, ప్రజల్లో సానుభూతి, భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు వైసీపీ ఆడిన డ్రామా అని విమర్శించారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసులు రెడ్డి, తేజోవతి, సుధమ్మ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని ముట్టెంబాక గ్రామంలో చింతా మోహన్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పంటా శ్రీనివాసులు, పూల చంద్రశేఖర్, దుంపల నాగరాజ్, తేజోవతి, దయాకర్, సుధా పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను తగ్గించాలి

పెళ్లకూరు, జనవరి 30: మాతా శిశు మరణాలు తగ్గించేందుకు వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి గర్భిణులు, బాలింతలు, శిశువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు శ్రీనివాస్ రావు, ప్రకాశ్ కోరారు. మండలంలోని నెలబల్లిలో గర్భిణులు, బాలింతలను గుర్తించేందుకు వైద్యసిబ్బంది చేపట్టిన సర్వేను పరిశీలించి తగు సూచనలు అందించారు. అనంతరం విలేజ్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి మాతా శిశు మరణాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు బేబిరాణి, వైద్యాధికారి సుజాత, రూత్‌వినయ్, ఏఎన్ఎంలు ఇందిర, శారద, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు: ఆర్ఐవో

తిరుపతి(విద్య), జనవరి 30: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీజూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్, హైస్కూల్స్ ప్లస్ హెచ్ఎంలతో సమీక్షించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 5నుంచి 20 తేదీవరకు మూడు స్పెల్స్‌లో, జనరల్ కోర్సులకు అదేనెల 11నుంచి 20వ తేదీవరకు రెండు స్పెల్స్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. 138 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 22,454మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఉంటాయని చెప్పారు. ప్రత్యేక అధికారి విశ్వనాథ నాయక్, డీఈసీ సభ్యులు డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి, ఎ.రఘుపతి, తులసీరామిరెడ్డి, వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

2న ఎథిక్స్, 3న పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయి. ఈపరీక్షలకు విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఈపరీక్ష పాసైతేనే ఇంటర్ ఉత్తీర్ణులైనట్లు పెద్ద మార్కుల జాబితా వస్తుందని ఆర్ఐవో తెలిపారు. గతంలో ఈ పరీక్షకు హాజరుకాని(2014-15నుంచి గతేడాదివరకు) విద్యార్థులు కూడా పరీక్షను రాసే వెసులుబాటు ఉందని చెప్పారు.